ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కర్నూలు
జిల్లా వార్తలు
శనివారం 30 మార్చి 2024

రంజాన్ వేళలు

	ఇఫ్తార్(శనివారం)	సెహరీ(ఆదివారం)
కర్నూలు	6:35 (సాయంత్రం)	4:51 (ఉదయం)
ఎమ్మిగనూరు	6:32 (సాయంత్రం)	5:04 (ఉదయం)
ఆదోని	6:37 (సాయంత్రం)	4:52 (ఉదయం)







టీడీపీ జెండా ఎగురవేసిన చంద్రబాబు



రవ్వలకొండను మింగిన అనకొండ

- బనగానపల్లెకు పట్టిన శని రామిరెడ్డి
- అధికారంలోకి వస్తే నియోజకవర్గాన్ని తీర్చిదిద్దుతా
- నాపరాయి పరిశ్రమను ఆదుకుంటాం
- ప్రజాగళం సభలో టీడీపీ అధినేత చంద్రబాబు



మిద్దెలపైకి ఎక్కిన అభిమానులు

బనగానపల్లె, మార్చి 29: ఎమ్మెల్యే రామిరెడ్డి రవ్వలకొండను మింగిన అనకొండ అని, బనగానపల్లెకు పట్టిన శని అని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు అన్నారు. బనగానపల్లె స్థానిక పెట్రోల్ బంకు కూడలిలో శుక్రవారం నిర్వహించిన ప్రజాగళం సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. వైసీపీ పాలనలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఇక బనగానపల్లె నియోజకవర్గంలో వైసీపీ ఎమ్మెల్యే రామిరెడ్డి అడ్డూ అదుపు లేకుండా అరాచకాలు సాగిస్తున్నారన్నారు. మైనింగ్ యజమానులకు లీజుకు ఇవ్వాలన్నా, రాయల్టీలు ఇవ్వాలన్నా కమీషన్లు తీసుకుంటున్నాడని ఆరోపించారు. కొంత మంది ఎస్సీ, ఎస్టీలను బినామీలుగా పెట్టుకొని కబ్జాలు సాగిస్తున్నాడని, సిమెంటు ఫ్యాక్టరీల నుంచి కమీషన్లు, ఇక కొంతమంది రౌడీలతో బొలేరో బ్యాచ్‌లతో అరాచకాలు సాగిస్తున్నాడని ధ్వజమెత్తారు. నాటుసారా అమ్మకాల్లో కూడా ఆయన హస్తం ఉందన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే బనగానపల్లెను అన్ని రకాలుగా ఆదుకుంటామని, ఇక్కడ నిరుపేదలకు రెండు సెంట్ల భూమి ఇస్తామని హామీ ఇచ్చారు. నాపరాయి పరిశ్రమను ఆదుకుంటామని, బనగానపల్లెకు రింగు రోడ్డు, కోయిలకుంట్లకు బైపాస్ రోడ్డు, బనగానపల్లెలో ఇంజనీరింగ్ కళాశాల, బనగానపల్లె, కోయిలకుంట్లలో పెండింగ్‌లో ఉన్న షాదిఖానాల నిర్మాణాన్ని పూర్తి చేస్తామని చెప్పారు. అలాగే బనగానపల్లెలో ఆటోనగర్ ఏర్పాటు చేస్తామని, బనగానపల్లె, కొలిమిగుండ్లలో సిమెంటు ఫ్యాక్టరీలు ఏర్పాటు చేసే వారికే భూములు ఇస్తామని, పరిశ్రమలు తీసుకువచ్చి ఉద్యోగా, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని భరోసా ఇచ్చారు.

రాయలసీమకు తీవ్ర అన్యాయం చేసిన జగన్..

రైతులకు 90 శాతం సబ్సిడీతో డ్రిప్ ఇరిగేషన్‌ను అందుబాటులోకి తెచ్చామని, రాయలసీయను హార్టికల్చర్ హబ్‌గా మార్చేందుకు కృషి చేశామని చెప్పారు. నందికొట్కూరులో మెగా సీడ్ పార్కుతోపాటు, జైన్ ఇరిగేషన్‌ను కూడా తీసుకువచ్చామని, అలాగే ఎమ్మిగనూరులో టెక్స్‌టైల్ పార్కును తీసుకువచ్చేందుకు అన్ని ప్రయత్నాలు చేశామని తెలిపారు. కానీ జగన్ వచ్చాక వాటన్నింటిని పక్కకు పెట్టడంతో ఇక్కడ యువతకు ఉపాధి లభించకుండా పోయిందన్నారు. ఓర్వకల్లులో వెయ్యి మెగావాట్ల విద్యుత్ పరిశ్రమను తీసుకువస్తే అది తన ఘనతగా జగన్ చెప్పుకుంటున్నాడని, అలాగే ఓర్వకల్లు విమనాశ్రయాన్ని రూ.90 కోట్లతో తాను పూర్తి చేసి ప్రారంభించానని, జగన్ అధికారంలోకి వచ్చాక తాను పూర్తి చేసినట్లు తన పార్టీ రంగులు వేసుకుని, తన తండ్రి విగ్రహాన్ని ఆవిష్కరించారని దుయ్యబట్టారు. నదుల అనుసంధానంతో గోదావరి జలాలను రాయలసీమకు తీసుకువచ్చి రాయలసీమను మరో కోనసీమగా మార్చాలని ప్రయత్నించానని, అందులో భాగంగా రూ.12 వేల కోట్లను రాయలసీమ ప్రాజెక్టుల కోసం ఖర్చు చేశానని చెప్పారు.



సొంత కొడుకు పేరిట భూములు..

ప్రజాగళం సభలో చంద్రబాబు నాయుడు మాట్లాడటానికి ముందు బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి మాట్లాడారు. ఎమ్మెల్యేగా ఉన్న రామిరెడ్డిని ఖాదీ గ్రామోద్యోగ సమితి సభ్యులు కస్టోడియన్‌గా ఎన్నుకోగా, ఆ సమితికి చెందిన భూములను కబ్జా చేసేందుకు పన్నాగం పన్నారని, అందులో భాగంగా తన కొడుకు పేరిట సంవత్సరానికి రూ.12 వేల చొప్పున 99 సంవత్సరాలకు లీజు రాయించుకున్నాడని, అలాగే పలు భూములను బినామీ పేర్లతో హస్తగతం చేసుకున్నాడని ఆరోపించారు. కొలిమిగుండ్లకు చెందిన బీసీ నాయకుడైన సుబ్బారావును దారుణంగా హత్య చేయించాడని అన్నారు. బనగానపల్లె నియోజకవర్గంలో టీడీపీకి చెందిన వందల మంది నాయకులపై ఎస్సీ, ఎస్టీ కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేశాడన్నారు. బనగానపల్లె పట్టణంలో దొంగ పట్టాలు ఇచ్చి పేదలను వంచించాడని, అలాగే ప్రస్తుతం ఇంటి పట్టాలంటూ పేదల నుంచి కోట్లు వసూలు చేశాడన్నారు. రవ్వలకొండలో మైనింగ్ చేసి దోచుకున్నాడని, బనగానపల్లె పట్టణంలో వెంచర్ యజమానులు నుంచి భారీ ఎత్తున కమీషన్లు దండుకుంటున్నాడన్నారు. గోరుకల్లు రిజర్వాయర్‌ను పూర్తి చేసి 13 టీఎంసీల నీటిని నిల్వ చేసిన ఘనత చంద్రబాబుదేనని అన్నారు. అలాగే ఇక్కడి నుంచి కడప, నెల్లూరు, చిత్తూరు జిల్లాల వరకు నీటిని తీసుకువెళ్లే అవుకు టన్నెల్ నిర్మాణం కూడా చంద్రబాబు హయాంలోనే జరిగిందని తెలిపారు.

చంద్రన్న రాజ్యం కావాలా.. రౌడీ రాజ్యం కావాలా?

ఇదే సభలో నంద్యాల టీడీపీ అభ్యర్థి బైరెడ్డి శబరి మాట్లాడుతూ ఈ ఐదేళ్లలో రౌడీ రాజ్యం సాగిందన్నారు. రైతులు సాగునీరు అడిగితే, వారికి నోటీసులు ఇచ్చి వేధింపులకు గురిచేశారన్నారు. చంద్రబాబు అధికారంలోనికి వస్తేనే వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. కాటసాని రామిరెడ్డి కబ్జాదారుడని, అలాంటి వారిని తరిమి కొడదామన్నారు. వైసీపీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి కల్తీ విత్తనాలతో రైతులను దగా చేస్తున్నారని, అలాంటి ఎంపీని చిత్తుచిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గోగిశెట్టి నరసింహారావుటీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్‌గౌడ్, బనగానపల్లె నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు, జనసేన, ఎమ్మార్పీఎస్ నాయకులు వేలాదిగా పాల్గొన్నారు.





చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న బీసీ, శబరి, గోగిశెట్టి



చంద్రబాబుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న చెరుకుచెర్ల రఘురామయ్య



సెల్‌ఫోన్లతో చంద్రబాబు ఫొటోలు తీసుకుంటున్న యువకులు

చంద్రబాబు, ఎన్టీఆర్ త్యాగాలు ఎనలేనివి

- తెలుగు వారి సంక్షేమమే వారి లక్ష్యం
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు
- పార్టీ కార్యాలయంలో 43వ ఆవిర్భావ వేడుకలు

కర్నూలు(అర్బన్), మార్చి 29: తెలుగు వారి కోసం చంద్రబాబు, ఎన్టీఆర్ ఎనలేని త్యాగాలు చేశారని, అవి మరువలేనివని ఎమ్మెల్సీ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు అన్నారు. శుక్రవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వ్యవస్థాపకుడు నందమూరి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, ఎంపీ సంజీవకుమార్, కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి టీజీ భరత్, ఎంపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజులతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1982కు ముందు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ రాష్ట్రాన్ని ఢిల్లీ కాంగ్రెస్ పెద్దలకు తాకట్టు పెట్టిందని అన్నారు. అప్పుడు ఆంధ్రులంటే ఢిల్లీ పాలకులకు చిన్నచూపు ఉండేదని, అలాంటి సమయంలో 1982 మార్చి 29న ఆంధ్రుల ఆత్మగౌరవం నినాదంతో ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించారని గుర్తు చేశారు. రాయలసీమ వెనుకబాటుతనాన్ని తొలగించడానికి ఆయన తెలుగుగంగకు అంకురార్పణ చేశారని అన్నారు. ఆయన ఆశయాలతో చంద్రబాబు నాయుడు ముందుకు తీసుకెళ్తున్నారని అన్నారు. తెలుగుదేశం పార్టీతోనే బడుగు, బలహీన వర్గాల వారికి న్యాయం జరుగుతుందని అన్నారు. జిల్లాలోని కర్నూలు పార్లమెంట్ స్థానంతో పాటు 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో తెలుగుదేశం, బీజేపీ, జనసేన పార్టీల అభ్యర్థులను గెలిపించి రాష్ట్రంలో దుష్ట వైసీపీ పాలనకు చరమగీతం పాడాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, నంద్యాల నాగేంద్ర, తిరుపాల్ బాబు, సీసీ వెంకటేశ్వర్లు, కే. పరమేష్, సంజీవలక్ష్మి, షేక్ ముంతాజ్, సత్రం రామక్రిష్ణుడు, డీ. జేమ్స్, హనుమంతరావు చౌదరి, కే. చంద్రకాంత్, నాగరాజు యాదవ్, మాజీ చైర్మన్ కే. వెంకటేష్, రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.



టీడీపీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

1 నుంచి పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం



కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 29: పదో తరగతి విద్యార్థుల జవాబు పత్రాల మూల్యాంకనం శిబిరం ఏప్రిల్ 1వ తేదీ నుంచి 8వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శ్యామేల్ శుక్రవారం తెలిపారు. కర్నూలు ఏ. క్యాంపు మాంటిస్సోరి ఇంగ్లీషు పాఠశాలలో మూల్యాంకన శిబిరం ఏర్పాటు చేశామన్నారు. అసిస్టెంట్ క్యాంప్ ఆఫీసర్లు ఏడుగురు, డిప్యూటీ క్యాంప్ ఆఫీసర్ ఒకరు, చీఫ్ ఎగ్జామినర్లు 150 మంది, అసిస్టెంట్ ఎగ్జామినర్స్ 600 మందిని నియమించామని తెలిపారు. ఇప్పటికే వీరందరికీ విధులకు సంబంధించిన ఉత్తర్వులను పంపించామని తెలిపారు. ఆర్డర్లు వచ్చిన వారందరూ 1వ తేదీన కర్నూలు ఏ. క్యాంపులోని మూల్యాంకనం శిబిరానికి వచ్చి రిపోర్టు చేసుకోవాలని డీఈవో సూచించారు. మూల్యాంకనం పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు డీఈవో తెలిపారు.

ఏసీ గోడౌన్‌కు భారీగా మిరప బస్తాలు

- ధరలు పడిపోవడంతో నిలువ చేయక తప్పని స్థితి
- అప్పులు ఎట్లా తీర్చాలని రైతుల ఆవేదన



మిరప బస్తాలతో గోడౌన్‌కు తరలి వచ్చిన ట్రాక్టర్లు

కోడుమూరు (రూరల్), మార్చి 29: మిర్చి ధర దారుణంగా పడిపోయింది. ఎకరాకు రూ. లక్షకుపైగా పెట్టుబడిపెట్టి మిర్చి సాగు చేస్తే మార్కెట్‌లో మాయాజాలానికి రైతులు బలైపోయారు. అప్పులకు వడ్డీలు పెరుగుతున్నప్పటికీ, ధరలు మరీ పడిపోవడంతో రైతులు ప్యాలకుర్తి వద్ద ఉన్న ఏసీ గోడౌన్‌లో నిలువు చేసుకోడానికి తరలిస్తున్నారు. శుక్రవారం ఈ గౌడౌన్‌కు వివిధ ప్రాంతాల నుంచి మిరప బస్తాలు పోటెత్తాయి. ఎంకే కొట్టాల, కురుకుంద, కమ్మరచేడు, అరికెర, హాలహర్వి, బ్రాహ్మణదొడ్డి గ్రామాల రైతులు మాట్లాడుతూ ఎరువులు, క్రిమిసంహారక మందులు, కూలీలు, కోత తదితర ఖర్చులు తడిసిమోపెడయ్యాయని అన్నారు. ఎకరాకు రూ. లక్షకు పైగా పెట్టుబడి పెట్టాల్సి వచ్చిందని, పైగా ఈ ఏడాది సరైన వర్షాలు లేకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటిపోయాయని ఆవేదన చెందారు. బాడుగలు చెల్లించి ట్యాంకర్లతో నీటి తడులు అందించ పంటను కాపాడుకోవాల్సి వచ్చిందని అన్నారు. కంటిమీద కునుకు లేకుండా పంటను కాపాడుకుంటే మార్కెట్లో ధరలు దారుణంగా పడిపోయాయని రైతులు నారాయణరెడ్డి, ఏసు, ఈరన్న, రాజన్, అబ్దుల్లా ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో అదనంగా రవాణా ఖర్చుల భారం మోస్తూ ఏసీ గోడౌన్‌లో నిల్వ చేసుకోడానికి ఇక్కడికి తీసుకొచ్చామని రైతులు పేర్కొన్నారు.

పీవోలు, ఏపీవోలకు నేటి నుంచి శిక్షణ

కర్నూలు(కలెక్టరేట్), మార్చి 29: ఎన్నికల సందర్భంగా శనివారం నుంచి పీవోలు, ఏపీవోలకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించనున్న నేపథ్యంలో శుక్రవారం మధ్యాహ్నం మ్యాన్ పవర్ మేనేజ్‌మెంట్, ట్రైనింగ్ మేనేజ్‌మెంట్, ఈవీఎం నోడల్ అధికారులు, ఆర్వోలతో కలెక్టర్ జి.సృజన టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పీవోలు, ఏపీవోలకు సుంకేసుల రోడ్డులోని ఎంఆర్‌సీ కన్వెన్షన్ హాల్లో శిక్షణా కార్యక్రమాలు మొత్తం నాలుగు సెషన్లలో 8 నియోజవకర్గాలకు శిక్షణ ఇవ్వనున్నామన్నారు. నేడు మొదటి సెషన్‌లో మంత్రాలయం, ఆలూరు నియోజకవర్గాలకు, రెండో సెషన్‌లో ఎమ్మిగనూరు, పత్తికొండ నియోజకవర్గాలకు ఏప్రిల్ 1వ తేదీన మొదటి సెషన్‌లో కోడుమూరు, ఆదోని నియోజకవర్గాలకు, రెండో సెషన్‌లో కర్నూలు, పాణ్యం నియోజకవర్గాలకు శిక్షణ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. జిల్లాలో మొత్తం పీవోలు, ఏపీవోలు 5357 మందిని నియమించగా.. ఇందులో 176 మంది రిటైర్మెంట్ తదితర కారణాల వల్ల ఆర్డర్స్ సర్వే చేయలేకపోయామన్నారు. మిగిలిన 5181 మందికి ఆర్డర్స్ సర్వే చేశామని తెలిపారు. ఆర్డర్స్ తీసుకున్న పీవోలు, ఏపీవోలు అందరూ తప్పనిసరిగా శిక్షణకు హాజరు కావాలని ఆదేశించారు. హాజరు కాకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కాన్ఫరెన్స్‌లో జేసీ నారపురెడ్డి మౌర్య, డీఆర్వో మధుసూదన్‌రావు, ఆదోని ఆర్వో సబ్ కలెక్టర్ శివనారాయణ శర్మ, కర్నూలు ఆర్డీవో శేషిరెడ్డి, ట్రైనింగ్ మేనేజ్‌మెంట్ నోడల్ అధికారులు సోమశేఖర్ రెడ్డి, మారుతి ప్రసాద్ పాల్గొన్నారు.

జగన్ బస్సు యాత్రకు నిరసన సెగ

వామపక్ష నాయకులను అరెస్టు చేసిన పోలీసులు



వామపక్ష నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

కోడుమూరు, మార్చి 29: ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కోడుమూరు మీదుగా చేపట్టిన బస్సుయాత్రకు కోడుమూరు నిరసన సెగ తగిలింది. కోడు మూరు మీదుగా ఎమ్మిగనూరుకు శుక్రవారం బస్సుయాత్ర చేపట్టారు. కోడు మూరుకు బస్సు యాత్ర చేరుకోక ముందే సీపీఎం, సీపీఐ నాయకులు గఫూర్ మియా, రాజు, వీరన్న, ఆధ్వర్యంలో కోడుమూరులో తాగునీటి సమస్యను పరిష్కరించాలి, సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నిర్మించాలని ప్లే కార్డును పట్టుకొని రోడ్డు పక్కన నిరసనకు దిగారు. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి జగన్ బస్సుయాత్ర కోడుమూరుకు రాక ముందే వామపక్ష నాయకులను బలవంతంగా అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. దీంతో అక్కడ ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. బస్సు యాత్ర ముగిసిన అనంతరం వామపక్ష నాయకులను విడుదల చేశారు.

మూల్యాంకన నిధులు చెల్లించాలి: ఫ్యాప్టో

కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 29: గత సంవత్సరం పదో తరగతి మూల్యాంకన నిధులను, అంతకుముందు సప్లిమెంటరీ మూల్యాంకన నిధులను ఉపాధ్యాయులకు చెల్లించాలని ఫ్యాప్టోకార్యవర్గ సభ్యులు జిల్లా ఫ్యాప్టో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.గోకారి, జి.తిమ్మప్ప డిమాండ్ చేశారు. స్థానిక సలాంఖాన్ ఎస్టీయూ భవనంలో శుక్రవారం ఫ్యాప్టో ఆధ్వర్యంలో ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడుతూ సుమారు 25 లక్షలకు పైగా మూల్యాంకన నిధులు పెండింగ్‌లో ఉన్నాయని, వీటిపై పలు దఫాలుగా జిల్లా విద్యాశాఖ అధికారులకు తెలిపినా ఇంతవరకు చెల్లించలేదన్నారు. ఈనెల 31లోపు చెల్లించని పక్షంలో ఏప్రిల్ 1న ప్రారంభమయ్యే మూల్యాంకన విధులను బహిష్కరిస్తామనా హెచ్చరించారు. పుట్టపాశం ఎంపీయుపీ పాఠశాలలో పని చేస్తూ ఆత్మ హత్య చేసుకున్న రాజశేఖర్ శర్మ విషయంలో అధికారులు విచారణ చేయకుండా సస్పెండ్ చేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నుంచి యూటీఏ రవికుమార్, ఏపీటీఎఫ్ 1938 మరియా నందం, ఏపీటీఎఫ్ 257 రంగన్న, ఎస్టీయూ టీకే జనార్దన్, హెచ్ఎంఏ నారాయణ, బీటీఏ నందీశ్వరుడు, ఆప్టా సేవా నాయక్, సుశీల్ కుమార్ పాల్గొన్నారు.

విద్యాసంస్థల్లో ముందస్తు అడ్మిషన్లు అరికట్టాలి

కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 29: జిల్లాలో ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో ముందస్తు అడ్మిషన్లను అరికట్టాలని జిల్లా విద్యాశాఖ అధికారులను ఏఐఎస్ఎఫ్ జిల్లా శాఖ డిమాండ్ చేసింది. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్.షాభీర్ బాషా, జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.శరత్ కుమార్ మాట్లాడుతూ విద్యాసంవత్సరం పూర్తి కాకముందే ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి కొన్ని పాఠశాలలు ముం దస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. నగరంలో పెద్ద పెద్ద హోర్డింగులు, రంగుల కరపత్రా లతో విద్యాసంస్థల యజమాన్యాలు విద్యార్థుల తల్లిదండ్రులను ఎరవేస్తున్నట్లు తెలిపారు. ముందస్తు అడ్మిషన్లను అరికట్టకపోతే ఆయా విద్యాసంస్థల వద్ద ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు ప్రేమ్, గౌస్, రఫిక్, కళ్యాణ్, హరీష్ పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో రాష్ట్రం సర్వనాశనం

పాణ్యం టీడీపీ అభ్యర్థి గౌరు చరిత



టెలికాంనగర్‌లో సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తున్న గౌరు చరిత

కల్లూరు, మార్చి 29: వైసీపీ పాలనలో రాష్ట్రం సర్వనాశనమైందని పాణ్యం టీడీపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. శుక్రవారం కల్లూరు అర్బన్ 20వ వార్డు టెలికాం నగర్‌లో ఆమె శంఖారావం, టీడీపీ సూపర్‌సిక్స్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకుని మేనిఫేస్టో పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గౌరు చరిత మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల కోసం చంద్రబాబు సూపర్‌సిక్స్ పథకాలను ప్రవేశపెట్టారన్నారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి పెరుగు పురుషోత్తంరెడ్డి, ప్రభాకర్‌యాదవ్, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, పల్లె రఘునాథ్‌రెడ్డి, మాండ్ర నరేంద్రనాథ్‌రెడ్డి, వంగాల జనార్దన్‌రెడ్డి, జనసేన నాయకుడు ప్రవీణ్ పాల్గొన్నారు.

● కల్లూరు అర్బన్ 35వ వార్డు చింతలమునినగర్‌లో పాణ్యం టీడీపీ అభ్యర్థి గౌరు చరిత తనయుడు గౌరు జనార్దన్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఇంటింటికీ తిరిగి టీడీపీ మేనిఫేస్టోను ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కోటేష్‌గౌడ్, రవిప్రకాష్‌రెడ్డి, సుంకన్న, పీయూ మాదన్న, ఎల్లప్ప, గోవింద్, గిరి, సుశీలమ్మ పాల్గొన్నారు.

అబద్ధాల కోరు జగన్: అబద్ధాల కోరు జగన్ అని పాణ్యం టీడీపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత, గౌరు వెంకటరెడ్డి ఫైర్ అయ్యారు. శుక్రవారం తన స్వగృహంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. నంద్యాల సభలో జగన్ తన మోసాల్ని టీడీపీకి అంటగట్టి చెప్పిన అబద్ధమే వంద సార్లు చెప్పడం జగన్ నైజమని దుయ్యబట్టారు. 85శాతం హామీలు అమలు చేయకుండా మాట తప్పారని, సంక్షేమానికి జగన్ 15 శాతం ఖర్చు చేస్తే చంద్రబాబు ప్రభుత్వం హయాంలో 19శాతం ఖర్చు చేశామన్నారు. మద్య నిషేధం చేశాకే ఓట్లు అడుగుతానని మాటిచ్చి తప్పారని విమర్శించారు. మూడు లక్షల ఉద్యోగాలు, సీపీఎస్ రద్దు హామీ లను అమలు చేయడంలో విఫలమయ్యారని అన్నారు. విద్యుత్ చార్జీలు తొమ్మిది సార్లు పెంచి రూ.64 వేల కోట్ల భారం ప్రజలపై వేసింది నిజం కాదా అని ప్రశ్నించారు. ఉచిత ఇసుకను రద్దు చేసి రూ.50వేల కోట్ల కుంభకోణం చేశారని ఆరోపించారు. ఇద్దరు పిల్లలకు అమ్మఒడి ఇస్తానని చెప్పి ఒక్కరికే ఇచ్చారని, రైతుభరోసా రూ.12500 హామీపై మాట తప్పి రూ.7500 మాత్రమే ఇచ్చారని అన్నారు. 25 లక్షల పక్కా ఇళ్లు ఉచితంగా నిర్మిస్తానని చెప్పి పేదలను అప్పులపాలు చేశాడని, సెంటు పట్టా పేరుతో రూ.7 వేల కోట్ల కుంభకోణం చేశారని ఆరోపించారు. 14లక్షల అసైన్డ్ భూములను వైసీపీ మూకలు కబ్జా చేశారని ఆరోపించాయి. టీడీపీ హయాంలో అన్నా క్యాంటీన్లు, పండగ కానుకలు, నిరుద్యోగ భృతి, పసుపు కుంకుమ లాంటి 120 సంక్షేమ పథకాలను రద్దు చేశాడని తెలిపారు. జగన్ పాలనలో అన్ని వర్గాలు నష్టపోయారని ప్రశ్నించిన దళిత, బడుగు, బలహీన వర్గాల 1000 మందికి పైగా హత్య గావించబడ్డారని సూచించారు. కూటమి దెబ్బకు వైసీపీకి వెన్నులో వణుకు మొదలైందని, టీడీపీ కూటమి గెలుపు తథ్యమని గౌరు చరిత, గౌరు వెంకటరెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

● ఇచ్చిన హామీలను అమలు చేయలేని అసమర్థుడు, మోసగాడు జగన్ అని నంద్యాల పార్లమెంట్ తెలుగు మహిళా అధ్యక్షురాలు కె.పార్వతమ్మ ఆరోపించారు. శుక్రవారం 41వ వార్డు వీకర్ సెక్షన్ కాలనీలోని తన కార్యాలయంలో ఆమె మాట్లాడారు. రాబోవు ఎన్నికల్లో టీడీపీకి ఓటువేసి గెలిపించాలని కె.పార్వతమ్మ స్పష్టం చేశారు.

కర్నూలును అభివృద్ధి చేస్తా: టీజీ భరత్



మాట్లాడుతున్న టీజీ భరత్

కర్నూలు(అర్బన్), మార్చి 29: కర్నూలును అభివృద్ధి చేస్తానని తెలుగుదేశం పార్టీ అభ్యర్థి టీజీ భరత్ అన్నారు. శుక్రవారం రాత్రి నగరంలోని ఎన్ఆర్‌పేటలో నిర్వహించిన పార్టీ చేరికల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. యువకులకు కండువాలు వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం టీజీ భరత్ మాట్లాడుతూ తాను స్వార్థ ప్రయోజనాల కోసం రాజకీయాల్లో లేనని, ప్రజా సేవ కోసం వచ్చానని తెలిపారు. తాను గెలిచాక కర్నూలుకు పరిశ్రమలు తీసుకొస్తానని భరోసా ఇచ్చారు. ఒక్క పరిశ్రమ వచ్చినా యువత భవిష్యత్తుకు మంచి మార్గం దొరుకుతుందన్నారు. కులం, మతం, చూడకుండా టీడీపీని ఆదరించాలని కోరారు. అనంతరం కొందరు టీడీపీలో చేరారు. చేరిన వారిలో రెహ్మత్ ఖాన్, రఘు, విజయ్, సాయి, బాలు, రహిమ్, యాస్మిన్, కళ్యాణ్ సింగ్, తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి విక్రమ్ సింగ్, కల్యూర చంద్రశేఖర్, అనురాధ, చంద్రశేఖర్, శంకర్ సింగ్, నాగేంద్ర, అన్వరు, చంద్రకాంత్, మణిప్రకాష్, భాస్కర్, సాయి, లక్ష్మన్న, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

తుగ్గలి ఎంపీపీ రాజీనామా

కర్నూలు(న్యూసిటీ), మార్చి 29: తుగ్గలి ఎంపీపీ ఆదెమ్మ అనారోగ్య కారణాలతో తన పదవికి రాజీనామా చేస్తూ జడ్పీ సీఈవో నాసరరెడ్డికి శుక్రవారం తన రాజీనామా లేఖను అందజేశారు. ఈ మేరకు జడ్పీ సీఈవో ఆమె రాజీనామా పత్రాన్ని ఆమోదించారు.

టీడీపీలోకి పులకుర్తి వైసీపీ నాయకులు

కర్నూలు(రూరల్), మార్చి 29: కోడుమూరు మండలం పులకుర్తి గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు నాయకులు శుక్రవారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. కర్నూలులో టీడీపీ సీనియర్ నాయకులు ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి, కర్నూలు పార్లమెంటు టీడీపీ అభ్యర్థి బస్తిపాటి కురువ నాగరాజు సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి విష్ణు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో బొగ్గుల దస్తగిరిని, ఎంపీ అభ్యర్థి నాగరాజును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. టీడీపీలో చేరిన వారిలో బోయ సంగాల, గోవిందు, మిన్నెల్ల, బజారి, రవి, చిన్నజమ్మన్న, చిన్నరా ముడు, సురేంద్ర, రవి, సుంకన్న ఉన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రం సుభిక్షం

గూడూరు, మార్చి 29: చంద్రబాబుతోనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని టీడీపీ నాయకుడు రేమట వెంకటేష్ అన్నారు. శుక్రవారం గూడూరు నగర పం చాయతీ పరిధిలోని 7, 8 వార్డుల్లో బాబు షూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా రేమట వెంకటేష్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్ని కల్లో టీడీపీ గెలిచి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వీరకుమార్, బాబు, నాయుడు, నాగరాజు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

సెలవు రోజు ప్రత్యేక కౌంటరు

కర్నూలు(న్యూసిటీ), మార్చి 29: నగర పాలక సంస్థ కార్యాలయంలో పన్ను వసూళ్లు చేసేందుకు సెలవు రోజు ప్రత్యేక కౌంటరు ఏర్పాటు చేశారు. ఆస్తిపన్ను, ఖాళీ స్థలం పన్నుల బకాయిలను 2023-24 రెండో ఆర్థిక సంవత్సరానికి సంబం ధించి ఈ నెలాఖరు వరకు పూర్తిగా చెల్లించిన వారికి ఆపరాధ రుసుము మాఫీ చేస్తున్నట్లు ఇటీవల కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం సెలవు రోజు కూడా పన్ను వసూలు కేంద్రాలు అందుబాటులో ఉండటంతో పన్ను చెల్లించేందుకు ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. పన్నును నగర పాలక సంస్థ కార్యాలయం, వార్డుసచివాలయం, ఆన్‌లైన్‌లో చెల్లించవచ్చని రెవెన్యూ ఆఫీసర్ జునైద్ తెలిపారు. పన్ను వసూలు కేంద్రాన్ని మేనేజర్ చిన్నరాముడు, ఆర్ఐ సొహైల్, ఖలీల్ పరిశీలించారు.

రైతుల పట్ల వ్యాపార ధోరణి దారుణం

కర్నూలు(అగ్రికల్చర్), మార్చి 29: విత్తనోత్పత్తి చేస్తున్న రైతులపై ఈ ప్రభుత్వం వ్యాపార ధోరణితో వ్యవహరించడం దారుణమని ఉమ్మడి కర్నూలు జిల్లా రైతులు అన్నారు. గత సంవత్సరం పప్పుశనగ విత్తనాలను ఏపీ సీడ్స్ సంస్థకు అందించిన రైతులు శుక్రవారం ఆ కార్యాలయం ముందర ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారు. పప్పుశనగ విత్తనాలను దాదాపు 8వేల క్వింటాళ్ల దాకా ఏపీ సీడ్స్ సంస్థకు తాము అందించామని, ఆ సమసయంలో అడ్వాన్సుగా క్వింటానికి రూ.4,200ల ప్రకారం తమకు అధికారులు చెల్లించారని తెలిపారు. మార్కెట్‌లో ఏ ధర ఉంటే.. ఆ ధరను అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, ఇందులో భాగంగా ఆర్గనైజర్లకు అత్యధిక ధరలు చెల్లించినట్లుగానే తమకు చెల్లించాలని రామసుబ్బారెడ్డి, రంగన్న, శేఖర్, శ్రీనివాసరెడ్డి, అల్లాబకాష్, షాలీసాహెబ్, నాగరాజరావు, రామక్రిష్టారెడ్డి తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమకు క్వింటానికి రూ.6,900ల ప్రకా రం చెల్లించాలని, లేకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం



ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న బొగ్గుల దస్తగిరి

కల్లూరు, మార్చి 29: కర్నూలు జిల్లాలో తెలుగుదేశం పార్టీ 42వ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక మాదవ నగర్‌లోని గౌరు దంపతుల స్వగృహంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులతో కలిసి పాణ్యం టీడీపీ అభ్యర్థి గౌరు చరిత, గౌరు వెంకటరెడ్డి భారీ కేక్ కట్ చేశారు. ఈసందర్భంగా గౌరు దంపతులు మాట్లాడుతూ పార్టీ స్థాపించిన 9 నెలల్లో అధికారంలోకి వచ్చిన పార్టీ టీడీపీ అన్నారు. కార్యక్రమంలో పెరుగు పురుషోత్తంరెడ్డి, ప్రభాకర్‌యాదవ్, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, పల్లె రఘునాథ్‌రెడ్డి, వంగాల జనార్దన్‌రెడ్డి, మాండ్ర నరేంద్రనాథ్‌రెడ్డి, సీమ ప్రసాద్‌రెడ్డి, రాఘవేంద్రారెడ్డి, జనసేన నాయకుడు ప్రవీణ్ పాల్గొన్నారు.

కర్నూలు(న్యూసిటీ): టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని 38వ వార్డు మామిదాలపాడు క్లస్టర్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 38, 39,40 క్లస్టర్ ఇన్‌చార్జి వై.రామేశ్వరరెడ్డి, యూనిట్ ఇన్‌చార్జి విజయకుమార్, సురేంద్రగౌడు, ప్రసాద్, నవకాంత్, ఈ.మహేశ్వర రెడ్డి, ఈ. ఈశ్వర్‌రావు, ఈ.గంగాదర్, శరత్, దానం, శాంతన్న, సుజాత, ఎం. లక్ష్మమ్మ, భావమ్మ, శంకర్ పాల్గొన్నారు.

కర్నూలు(రూరల్): గీతాముఖర్జీ నగర్‌లోని టీడీపీ కార్యాలయంలో టీడీపీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి కోడుమూరు టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి పాల్గొని ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రామాంజనేయులు, గార్గేయపురం సురేష్ పాల్గొన్నారు.

సి.బెళగల్: మండల కేంద్రమైన సి.బెళగల్‌లో టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ ఎంపీటీసీ ఈరన్నగౌడు, టీడీపీ సీనియర్ నాయకుడు బాలజి వెంకటేశ్, నాయకులు అమర్, ధనుంజయుడు, మద్దిలేటి, బురాన్‌దొడ్డి వెంకటప్ప పాల్గొన్నారు.

గూడూరు: గూడూరులోని టీడీపీ కార్యాలయంలో నగర పంచాయతీ మాజీ వైస్ చైర్మన్ కురుకుంద రామాంజనేయులు ఆధ్వర్యంలో టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ కౌన్సిలర్లు మల్లాపు బుడ్డంగలి, కోడుమూరు షాషావలి, సృజన్, పౌలు, తెలుగు శ్రీనివాసులు, కుమార్, విజయ్ కుమార్, పెద్ద చాంద్ బాషా, మాజీ కౌన్సిలర్ మధుసూదన్, నరసింహులు, మదార్ సాహెబ్, షేక్షావలి పాల్గొన్నారు.

ఓర్వకల్లు: ఓర్వకల్లులో టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మిఠాయిలు పంపిణీ చేశారు. మండలంలోని పలు గ్రామాల్లో టీడీపీ నాయకులు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. నాయకులు మోహన్ రెడ్డి, లక్ష్మికాంతరెడ్డి, అల్లాబాబు, వేణుగో పాల్ రెడ్డి, నాగరాజు, అబ్దుల్లా పాల్గొన్నారు.

నేడు మాధవుడి రథోత్సవం

కోడుమూరు(రూరల్), మార్చి 29: మండలంలోని గోరంట్ల లక్ష్మీమాధవస్వామి రథోత్సవం శనివారం సాయంత్రం జరుగనుంది. వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగమైన రథోత్సవాన్ని తిలకించడానికి జిల్లా నలుమూలల నుంచే కాకుండా కర్ణాటక, తెలంగాణ ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తారు. శుక్రవారం సాయంత్రం ఉత్సవమూర్తుల రథారోహణం జరిగింది. ఈ సందర్భంగా రథమండపం వద్ద హోమం నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

కోడుమూరు(రూరల్), మార్చి 29: మండలంలోని కొత్తూరు సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. ఈఘటనలో ఆర్టీసీ బస్సు, బొలెరో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో రెండు వాహ నాలతో ఒక బైక్‌ను కూడా దెబ్బతింది.. బొలెరోలో ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులకు గాయాలయ్యాయి. బైక్‌పై ప్రయాణిస్తున్న వ్యక్తికి కూడా స్వల్ప గాయాలైనట్లు తెలిసింది. బస్సులో ఎవరికి గాయాలు కాలేదని అంటున్నారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అయితే బాధితుల వివ రాలు తెలియరాలేదు. ఎస్ఐ బాలనరసింహులు వివరాలు కోరగా ప్రమాదం జరిగినట్లు సమాచారం ఉందని, వివరాలు తెలియాల్సి ఉందన్నారు.

రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రత

జిల్లాలో అత్యధికంగా 42.3 డిగ్రీలు నమోదు

కర్నూలు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శుక్రవారం రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రత నమోదైంది. వాతావారణ శాఖ అధికారులు ఇచ్చిన రికార్డుల ప్రకారం గరిష్ఠంగా 42.3 డిగ్రీలు, కనిష్ఠంగా 27.7 డిగ్రీలు నమోదయ్యాయి. ఉదయం 9 గంటల నుంచే ఎండలు మొదలయ్యాయి. సాయంత్రం 5.30 గంటల వరకు వడగాల్పులతో జనం ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నం 11.30-12.00 గంటల నుంచి 3.30 గంటల వరకు కర్నూలు నగరంలో జన సంచారం తగ్గిపోయి రోడ్లన్నీ కర్ఫ్యూను తలపించాయి. గురువారం అత్యధికంగా 41.9 డిగ్రీలు, అత్యల్పంగా 26.2 డిగ్రీలు, బుధవారం గరిష్ఠంగా 40.9 డిగ్రీలు, కనిష్ఠంగా 25.3 డిగ్రీలు, మంగళవారం గరిష్ఠంగా 40.5 డిగ్రీలు, కనిష్ఠంగా 26.5 డిగ్రీలు నమోదయ్యాయి. రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో మధ్యా హ్నం ప్రజలకు బయటకు రాకూడదని, వేడిగాలులకు గురి కాకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, బయటకు వెళ్లేటప్పుడు కచ్చితంగా ప్రజలు టోపీలు, గొడుగులు ధరించాలని, ఎక్కువ శాతం నీరు, మజ్జిగ వంటి పానియాలు తాగుతూ వడదెబ్బకు గురి కాకుండా చూసుకోవాలని వైద్యులు సూచించారు. ఓర్వకల్లు, మంత్రాలయం, నందవరం, కోడుమూరు, కౌతాళం, పెద్దకడుబూరు, హొళగుంద, సి.బెళగల్, కల్లూరు, ఎమ్మిగనూరు, గూడూరు, కోసిగి, కర్నూలు మండలాల్లో అత్యధికంగా 40-41 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

కాంగ్రెస్ ప్రణాళికా కమిటీ చైర్మన్‌గా రామస్వామి

కర్నూలు(అర్బన్), మార్చి 29: కాంగ్రెస్ ప్రణాళికా కమిటీ చైర్మన్‌గా విశ్రాంత ఉన్నతాధికారి ఎస్ రామస్వామిని నియమించారు. శుక్రవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డీసీసీ కే.బాబురావు చేతుల మీదుగా ఆయన నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ ఉత్తర్వులు వెలువడిన వెంటనే అమలులోకి వస్తాయని డీసీసీ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్.రామస్వామి మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈపదవి ఇచ్చినందుకు పీసీసీ అధ్యక్షురాలు షర్మిల, ఏఐసీసీ ఆధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, డీసీసీ బాబురావుకు కృతజ్ఞతలు తెలిపారు. పీసీసీ ప్రధాన కార్యదర్శి దామోదరం రాధాకృష్ణ, వెంకటన్న, షఫ్రక్ నవీద్, సత్యనారాయణ గుప్త, ప్రమీల, కే. జిలానీ, ఖాద్రి బాషా పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

ఓర్వకల్లు, మార్చి 29: మండలంలోని శకునాల గ్రామంలో బీసీ, ఎస్సీ కాలనీల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని సీపీఎం కార్యదర్శి చంద్రబాబు నాయుడు కోరారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శకునాల గ్రామంలో తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సీపీఎం బృందం గ్రామాన్ని సందర్శించిందన్నారు. గత నెల రోజులుగా బీసీ, ఎస్సీ కాలనీల్లో తాగునీరు కోసం పనులు మానుకుని వాటర్ ట్యాంకులు ఎప్పుడు వస్తాయోనని ఎదురు చూస్తున్నారన్నారు.

మానవజాతి పునరుద్ధరణకే క్రీస్తు శిలువ మరణం

- చర్చిలలో క్రైస్తవ మత పెద్దల ఉద్బోధన
- భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే



క్రీస్తు సందేశాన్ని తెలియజేస్తున్న పూర్వ బిషప్ పుష్పలలితమ్మ

కర్నూలు (కల్చరల్), మార్చి 29: మానవజాతి పునరుద్ధరణకే క్రీస్తు ప్రభువు శిలువ మరణం చెందారని, ఏసుక్రీస్తు బోధనలు ప్రపంచ మానవాళికి ఆచరణీయమని, ఆయన చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ శాంతియుతంగా జీవించాలని పలువురు క్రైస్తవ మత పెద్దలు ఉద్బోధించారు. శుక్రవారం ఉమ్మడి జిల్లాల్లోని అన్ని క్రైస్తవ ఆలయాల్లో గుడ్‌ఫ్రైడే వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా చర్చిలలో మత పెద్దలు గుడ్‌ఫ్రైడే సందేశాన్ని వినిపించారు. క్రైస్తవులు దైవారాధనలు, దైవ ప్రార్థనలతో ఉపవాసాలు పాటించారు. నగరంలోని యెహోవా షమ్మా చర్చిలో పాస్టర్ డాక్టర్ బి. స్టీఫెన్ చార్లెస్, కోల్స్ సెంటినరీ తెలుగు బాప్టిస్టు చర్చిలో పాస్టర్ అనిల్ శ్యామేల్, పాస్టర్ పాస్కల్ ప్రకాష్‌లు గుడ్‌ఫ్రైడే సందేశాన్ని ఇచ్చారు. ఎస్‌పీజీ (సీఎస్ఐ) చర్చిలో పూర్వ బిషప్ పుష్పలలితమ్మ వాక్య సందేశం ఇచ్చారు. ప్రార్థన మందిరంలో పాస్టర్ రెవ. కరుణసాగర్, స్టాంటన్ చర్చిలో పాస్టర్ దేవ సహాయం, పాస్టర్ విక్టర్ ఇమ్మానియేల్ గుడ్‌ఫ్రైడే గురించి తెలియజేశారు. హోసన్న మందిరంలో పాస్టర్ ఫ్రెడ్రిక్ పాల్, హోరేబు చర్చిలో శాంసోనన్న క్రీస్తు శిలువలో పలికిన ఏడు మాటల గురించి వివరించారు. నగరంలోని రాక్‌వుడ్ చర్చి, గిప్సన్ చర్చి, బిషప్ చర్చిలతోపాటూ వివిధ క్రైస్తవ ఆలయాల్లో గుడ్‌ఫ్రైడే వేడుకలో ఆయా చర్చిల ప్రతినిధులు దైవ సందేశాన్ని, గుడ్‌ఫ్రైడే ప్రాముఖ్యతను వివరించారు.

● **రేపు ఈస్టర్ వేడుక...** గుడ్‌ఫ్రైడే రోజున శిలువ మరణం చెందిన క్రీస్తుప్రభువు పునరుత్థానుడై తిరిగి ఆదివారం జన్మించిన వేడుక 'ఈస్టర్' వేడుకను ఆదివారం క్రైస్తవులు నిర్వహించుకోనున్నారు. చర్చిల్లో ఈస్టర్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు, దైవ సందేశాలను మత పెద్దలు అందించనున్నారు.

క్రీస్తు శిలువ యాత్ర: కల్లూరు మండలం పందిపాడులోని రక్షణ మందిరం ఆధ్వర్యంలో, పాస్టర్ సువర్ణరాజు క్రీస్తు శిలువ యాత్రను పందిపాడు నుంచి ముజఫర్‌నగర్, గోవర్ధన్ నగర్, మాదిరాజు నగర్, బీఆర్‌రెడ్డి కాలనీ ప్రాంతాల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి డాక్టర్ సునీల్ కన్నా ముఖ్య అతిథిగా హాజరై క్రీస్తు శిలువ యాత్రను ప్రారంభించారు. మైనారిటీ శాఖ సూప రింటెండెంట్ డి.శ్యాంబాబు పాల్గొన్నారు.

ఓర్వకల్లు: మండలంలోని ఓర్వకల్లు, పూడిచెర్ల, నన్నూరు, హుశేనాపురం, కాల్వ, ఉయ్యాలవాడ, ఉప్పలపాడు తదితర గ్రామాల్లో గుడ్ ఫ్రైడేను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఓర్వకల్లులో శిలువను మోస్తు గ్రామ వీధుల్లో ఊరేగింపు చేశారు. ఆయా గ్రామాల్లోని చర్చిలలో క్రైస్తవులు, పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమాల్లో క్రైస్తవులు, పాస్టర్లు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

కర్నూలు(కల్చరల్), మార్చి 29: రంజాన్ మాసంలో ఉపవాసం పాటిస్తున్న ముస్లిం మహిళలకు, గుడ్‌ఫ్రైడే సందర్భంగా ఉపవాస ప్రార్థనల్లో ఉన్న క్రైస్తవ మహిళలకు నిత్యావసర సరుకులు ఉచితంగా పంపిణీ చేశారు. శుక్రవారం నగరంలోని 48వ వార్డు రోజా వీధిలో, విశాఖపట్నం ఆర్‌డీవోగా పనిచేస్తున్న కర్నూలు వాసి హుస్సేన్ సాహెబ్, ఆయన పెద్ద కుమార్తె ఆశ, సయ్యద్ మెహమ్మద్‌ల కుటుంబ సభ్యులు ఇచ్చిన ఆర్థిక సాయంతో, ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ మహిళా ఐక్యవేదిక నగర అధ్యక్షురాలు మీసాల సుమలత ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏపీ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు, విశ్రాంత ఎమ్మార్వో మురారి శంక రప్ప మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తాము సంపాదించిన దానిలో దైవ మార్గంలో ఖర్చు పెట్టాలని ప్రవక్త బోధించారని అన్నారు.



నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న శంకరప్ప

స్టేడియంలో మట్టి కుప్పలు



కర్నూలు(స్పోర్ట్స్), మార్చి 29: స్థానిక డీఎస్ఏ ఔట్‌డోర్ స్టేడియంలో నాసిరకం మట్టిని స్టేడియంలో కుప్పలుగా వేశారు. జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, మట్టి బాగాలేదు.. వాలీబాల్ కోర్టుకు అనువుగా ఉండదని చెప్పిన కాంట్రాక్టర్ మట్టి కుప్పలు అన్‌లోడింగ్ చేశారని డీఎస్‌డీవో తెలిపారు. క్రీడాకారులు, పీఈటీలు, పీడీలు, కోచ్‌లు అభ్యం తరం వ్యక్తం చేశారు.

పవిత్ర మాసం రంజాన్

ఇఫ్తార్ విందులో టీడీపీ నాయకులు



ముస్లింలకు భోజనం వడ్డిస్తున్న టీడీపీ నాయకులు

ఓర్వకల్లు, మార్చి 29: ముస్లింలకు రంజాన్ మాసం పవిత్రమైనదని టీడీపీ నాయకులు అన్నారు. శుక్రవారం మండలంలోని హుశేనాపురం గ్రామంలో నంద్యాల టీడీపీ అధ్యక్షులు మల్లెల రాజశేఖర్, గ్రామ ముస్లిం మైనార్టీ నాయకులు ఎస్.మహబూబ్ బాషా ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథులుగా పాణ్యం టీడీపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, టీడీపీ నందికొట్కూరు ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి, నంద్యాల టీడీపీ అధ్యక్షులు మల్లెల రాజశేఖర్, నంద్యాల టీడీపీ అభ్యర్థి ఎస్ఎండీ ఫరూక్‌లు హాజరయ్యారు. అనంతరం మసీదులో ప్రార్థనలు చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, నంద్యాల పార్లమెంటు అధ్యక్షురాలు పార్వతమ్మ, ముస్లిం మైనార్టీ నాయకులు మహబూబ్ బాషా, కాల్వబుగ్గ మాజీ చైర్మన్ చంద్రపెద్దస్వామి, మాజీ సర్పంచ్ మల్లెల జ్యోతి పాల్గొన్నారు.



జనం లేక వెలవెలబోతున్న సభ

అంత లేదు.. ఇంత లేదు..!

- లక్ష జనం వస్తారని అన్నారు.. పాతిక వేలు కూడా దాటలేదు
- పూర్ షోగా మారిన ఎమ్మిగనూరు మేము సిద్ధం సభ
- ఎమ్మెల్యే ఎర్రకోటకు అవమానం
- చేనేతల ఊసే ఎత్తని సీఎం జగన్
- బుట్టా రేణుక విన్నపాలకు స్పందన కరువు

కర్నూలు, మార్చి 29(ఆంధ్రజ్యోతి)/ఎమ్మిగనూరు: సార్వత్రిక ఎన్నికల ముందు సీఎం జగన్ చేపట్టిన ప్రచార బస్సు యాత్రలో భాగంగా సిద్ధం సభను సూపర్..డూపర్ సక్సెస్ చేస్తామని వైసీపీ నాయకులు అంచనాలు వేశారు. పల్లెపల్లెకు, వార్డు వార్డుకు డబ్బులు, మద్యం పంపిణీ చేశారు. ప్రతి గ్రామానికి ఆర్టీసీ బస్సులను పంపారు. ఏడు నియోజకవర్గాల నుంచి జనం లక్షకు పైగా వస్తారని పెద్ద ఎత్తున ప్రగల్బాలు పలికారు. తీరా పాతిక వేల మంది కూడా దాటలేదు. సీఎం జగన్ ప్రసంగిస్తుండగానే గుంపులు.. గుంపులుగా జనం వెళ్లిపోయారు. సభ ముందు వైపు ఉన్న గ్యాలరీలు మొత్తం ఖాళీ అయ్యాయి. ఈ స్థితి చూసి ఎందుకు ఇలా జరిగిందని వైసీపీ కార్యకర్తలు కొందరు చర్చించుకోవడం కొసమెరుపు. ఎన్నికల నేపథ్యంలో వైసీపీ అధినేత వైఎస్ జగన్ ప్రచారంలో భాగంగా 21 రోజుల బస్సు యాత్రకు శ్రీకారం చుట్టారు. మూడో రోజు శుక్రవారం గూడూరు మండలం పెంచికలపాడు నుంచి బస్సు యాత్ర మొదలైంది. కోడుమూరు, వేముగోడు, హెచ్ కైరవాడి, గోనెగండ్ల మీదుగా సాగింది. ఎమ్మిగనూరు మండలం రాళ్లదొడ్డి సమీపంలో మధ్యాహ్నం విశ్రాంతి తీసుకున్నారు. సాయంత్రం 5.30 గంటలకు వీవర్స్ కాలనీ మైదానంలో సభ ప్రారంభమైంది. అప్పటికే పట్టణంలోని వివిధ వార్డుల నుంచి వచ్చిన మహిళలు వెళ్లిపోయారు. సీఎం జగన్ ప్రసంగిస్తుండగా మరికొందరు వెళ్లిపోయారు. ఎమ్మిగనూరు సభ జనం లేక ప్లాప్‌షోగా మారిందని పలువురు చర్చించుకున్నారు. కోడుమూరు మండలం కొత్తూరు వద్ద మహిళలు ఖాళీ బిందెలతో నీటి సమస్య తీర్చాలని నిరసన తెలిపారు. కోడుమూరుకు ఎస్ఎస్ ట్యాంకు నిర్మించి తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని సీపీఐ నాయకులు, కార్యకర్తలు ప్లకార్డులు ప్రదర్శించారు. పోలీసులు వారిని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు.



సభ నుంచి వెళ్లిపోతున్న మహిళలు

ఎమ్మెల్యే ఎర్రకోటకు అవమానం

ఎమ్మిగనూరులో 1994 నుంచి గతేడాది అక్టోబరులో జరిగిన చేదోడు సభ వరకు ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి హవానే సాగింది. నాడు దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి అయినా.. నేడు సీఎం జగన్ అయినా ఎర్రకోటను పొగడ్తలతో ముంచెత్తేవారు. అయితే.. వయోభారం వల్ల ఎర్రకోట గెలవలేరనే సాకుతో ఆయన కుమారుడు ఎర్రకోట జగన్మోహన్‌రెడ్డికి సీఎం జగన్ టికెట్ నిరాకరించారు. మాజీ ఎంపీ బుట్టా రేణుకను బరిలోకి దింపారు. శుక్రవారం జరిగిన తాము సిద్ధం సభలో అభ్యర్థి బుట్టా రేణుక కాని, సీఎం జగన్ కాని ఎర్రకోట చెన్నకేశవరెడ్డి పేరు ఉచ్చరించకుండానే ప్రసంగించారు. బుట్టా రేణుక ఎమ్మెల్యేగారు.. అన్నారే తప్ప చెన్నకేశవరెడ్డి పేరు ప్రస్తావించలేదు. దీన్ని సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న ఎర్రకోటకు పరాభావంగా ఆయన సన్నిహితులే చర్చించుకోవడం కొసమెరుపు.

సిద్ధం సభతో ట్రాఫిక్ ఇబ్బందులు

ఎమ్మిగనూరులో సీఎం జగన్ మేము సిద్ధం సభతో ట్రాఫిక్ సమస్య తలెత్తింది. కర్నూలు ప్రధాన రహదారితో పాటు ఆదోని- మంత్రాలయం జాతీయ రహదారులపై సభకు వచ్చిన బస్సులు రోడ్డుపై ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. దీంతో కర్నూలు, మంత్రాలయం వైపు వెళ్లే ప్రయాణికులకు ట్రాఫిక్ సమస్య తప్పలేదు. గంటలు తరబడి రోడ్డుపైనే వాహనాలు నిలిచిపోవడంతో జనం అసహనం వ్యక్తం చేశారు. ప్రధానంగా సభ నిర్వహించిన వీవర్స్ కాలనీ మైదానం సమీపంలో ఉన్న జాతీయ రహదారి ఎంజీ సర్కిల్‌లో సభకు జనాన్ని తరలించిన బస్సులు తిరిగి వెళ్లే క్రమంలో కూడలిలోనే నిలిచిపోయాయి. దీంతో ట్రాఫిక్ జామయ్యింది. పట్టణంలో నుంచి శిల్పా ఎస్టేట్, మిలటరీ కాలనీ, వెంకటాపురం, సోమప్ప నగర్, మార్కెట్ కమిటీ వైపు వెళ్లే జనం తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. పోలీసులు సైతం ట్రాఫిక్‌ను క్లియర్ చేయడంలో విఫలమయ్యారు.

చేనేతలకు ఇచ్చిన గౌరవం ఇదేనా..?

చేనేతపురిగా పేరుగాంచిన ఎమ్మిగనూరులో నిర్వహించిన తాము సిద్ధం సభలో సీఎం జగన్ చేనేతల ఊసే ఎత్తకపోవడం సర్వత్రా చర్చగా మారింది. చేనేతల అభివృద్ధి కోసం హామీలు ఇస్తారని ఎంతో ఆశగా ఎదురు చూశారు. హామీ మాట దేవుడెరుగు.. కనీసం ఆ పదం కూడా ఉచ్చరించకపోవడం కొసమెరుపు. అయితే.. ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక మాట్లాడుతూ అన్నా.. ఎమ్మిగనూరులో నీటి సమస్య ఉంది.. ఎస్ఎస్ ట్యాంకు నిర్మించాలి, చేనేతలకు ఉపాధి కల్పించేందుకు టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేయాలని.. ఈ రెండు సమస్యలు తీర్చాలన్నా.. అంటూ విన్నవించింది. జగన్ వాటిని ఏ మాత్రం పట్టించుకోకపోవడం రాజకీయంగా విమర్శలకు తావిస్తోంది. కార్యక్రమంలో సీఎం జగన్ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను పరిచయం చేశారు. ఎమ్మిగనూరు ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుకమ్మను తర్వాత పరిచయం చేస్తానని చెప్పిన జగన్ ఆ తర్వాత ఆమెను పరిచయం చేయకుండానే ముగించేశారు.

తొక్కిసలాటలో ఇద్దరికి గాయాలు

మేము సిద్ధం సభలో సభా వేదిక ముందు జరిగిన సిద్ధం సభలో ఇద్దరు గాయపడ్డారు. ఆదోనికి చెందిన గోవర్ధన్, బనవాసికి చెందిన ప్రసాద్‌లు బారికేడ్లు దాటేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకోవడంతో కిందపడ్డారు. ఆ సమయంలో జరిగిన తొక్కిసలాటలో వారిద్దరు గాయపడ్డారు. చికిత్స కోసం ఎమ్మిగనూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా మెరుగైన చికిత్స కోసం అక్కడి నుంచి పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.





తాగారు..తూగారు

మేము సిద్ధం సభకు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన కొంతమంది వైసీపీ కార్యకర్తలు మద్యం మత్తులో తూగి తూలారు.. సీఎం జగన్ ప్రయాణిస్తున్న బస్సు ఎమ్మిగనూరుకు రాక ముందు నుంచే, సభా ప్రారంభం కాకముందే మద్యం దుకాణాల దగ్గర ఎగబడి మద్యాన్ని కొనుక్కోవడం కనిపించింది. అంతేగాక దుకాణాల ముందు రోడ్డు పక్కన, రోడ్డుపైన మద్యం తాగుతూ చిందులేశారు. వైసీపీ టోపీలు, జెండాలు పట్టుకొని మద్యం తాగడం, వైసీపీ నాయకులు ఇచ్చిన బిర్యాని పొట్లాలు తీసుకొని తింటూ కనిపించారు.



మద్యం సేవిస్తూ..

ఘనంగా సుయతీంద్రతీర్థుల ఆరాధన

- ఉత్సవాలను ప్రారంభించిన పీఠాధిపతి
- బృందావనానికి పంచామృతాభిషేకం
- ఆకట్టుకున్న ప్రవచనాలు



మంత్రాలయం, మార్చి 29: మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం పూర్వ పీఠాధిపతి సుయతీంద్ర తీర్థుల 11వ మహా సమారాధనోత్సవాలు శుక్ర వారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మంత్రాలయం నవనిర్మాణ శిల్పిగా పేరొందిన సుయతీంద్రతీర్థుల బృందావనానికి విశేష పంచామృతాభిషేకం నిర్వహించి బంగారు, వెండి ఆభరణాలు, పట్టువస్త్రాలు, ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. యాగశాలలో పీఠాధిపతి జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. పండితులు వినిపించిన సుయతీంద్రతీర్థుల ప్రవచనాలు ఆకట్టుకున్నాయి. మూలరాములు, జయరాములు, దిగ్విజయరాములకు కనకాభిషేకం చేసి హారతులు ఇచ్చారు. వివిధ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులకు శేషవస్త్రం, ఫలపుష్ప మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పండిత కేసరి విద్వాన్ డా. రాజాఎస్ గిరిరాజాచార్, ఎస్ఎన్ వెంకటేశాచార్, ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేశ్‌జోషి, శ్రీపతాచార్, ఐపీ నరసింహమూర్తి, ఈఈ సురేష్ కోనాపూర్ పాల్గొన్నారు.

మంగళసూత్రం చోరీ యత్నం

- దొంగను పట్టి పోలీసులకు అప్పగించిన బంధువులు

మంత్రాలయం, మార్చి 29: మంత్రాలయం రాఘవేంద్రస్వామి దర్శనార్థం వచ్చిన ఓ మహిళ మెడలో మంగళసూత్రాన్ని చోరీకి యత్నిస్తుండగా బంధువులు వెంటపడి పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఆదోని మండలం కుప్పగల్లుకు చెందిన బోయ శ్రీనివాసులు, దేవేంద్రమ్మ దంపతులు తమ కుటుంబ సభ్యులతో రాఘవేంద్రస్వామి దర్శనానికి వచ్చారు. గురువారం రాత్రి నదీతీరంలో నిద్రిస్తుండగా మంత్రాలయానికి చెందిన రామక్రిష్ణ అనే వ్యక్తి దేవేంద్రమ్మ మెడలో ఉన్న మంగళసూత్రాన్ని తెంచుకుని పరారయ్యాడు. బంధువులు వెంటపడి నిందితుడ్ని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. మంత్రాలయం ఎస్ఐ గోపినాథ్ కేసు నమోదు చేసుకొని, నిందితున్ని కోర్టులో హాజరు పరచగా రిమాండ్‌కు ఆదేశించినట్లు తెలిపారు.

30 ట్రాక్టర్ల గ్రాసం దగ్ధం

- రూ.10 లక్షల నష్టం

మద్దికెర, మార్చి 29: పశువుల కోసం బైలు స్థలంలో రైతులు నిల్వగా ఉంచుకున్న 30 ట్రాక్టర్ల గ్రాసం మంటలకు దగ్ధమైంది. ఈ ప్రమాదంలో రూ.10 లక్షల నష్టం వాటిల్లింది. శుక్రవారం మద్దికెర గ్రామంలోని ప్రభుత్వ వైద్యశాల పరిసర ప్రాంతాల్లో నేసరి హనుమంతు 26 ట్రాక్టర్ల పశుగ్రాసం, నేసరి శీనప్ప 4 ట్రాక్టర్ల పశుగ్రాసం తమ బైలు స్థలంలో నిల్వగా ఉంచుకున్నారు. ఏడాదికి సరిపడ ఈ గడ్డికి నిప్పంటుకొని మధ్యాహ్నం 1 గంట ప్రాంతంలో మంటలు ఎగిసిపడ్డాయి. భారీ అగ్నిప్రమాదం కావడంతో మంటలు ఆర్పలేకపోయారు. సకాలంలో ఫైరింజన్లు కూడా రాలేకపోయాయి. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారా? లేదా ఎవరైనా బీడి, సిగరెట్ తాగి పొరపాటున పడేసి వెళ్లారా? అన్నది తెలియాల్సి ఉంది. వీఆర్వో రంగస్వామి సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వానికి నివేదికలు పంపుతామని చెప్పారు. రైతులను ఆదుకోవాలని మాజీ జడ్పీటీసీ సభ్యుడు జమేదార్ రాజన్న యాదవ్, జిల్లా టీడీపీ నాయకులు ఎన్. లక్ష్మీనారాయణ, మండల తెలుగు యువత ఉపాధ్యక్షుడు ఉదయ్ కుమార్ కోరారు.

వ్యక్తి మృతి

ఓర్వకల్లు, మార్చి 29: మండలంలోని బ్రాహ్మణపల్లె గ్రామానికి చెందిన కమ్మరి రామ్మోహన్ నాయుడు (45) శుక్రవారం ప్రమాదవశాత్తు ద్విచక్రవాహనం నుంచి కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు బ్రాహ్మణపల్లె గ్రామం నుంచి కాల్వ గ్రామానికి పని నిమిత్తం వెళ్లి స్వగ్రామం వస్తుండగా.. కాల్వ గ్రామ సమీపాన ద్విచక్రవాహనం నుండి కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య జయంతి, కుమార్తె, కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జగన్ చేసిన మోసాలు చాలు

- మంత్రి బుగ్గనను ప్రజలు ఓడించడం ఖాయం
- టీడీపీ కూటమి డోన్ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి




డోన్, మార్చి 29: గత ఎన్నికల ముందు వైఎస్ జగన్ ఎన్నెన్నో హామీలు ఇచ్చి వాటిని నెరవేర్చకుండా ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రజలకు చేసిన మోసాలు చాలని, ఇక ఆయన్ను ఇంటికి పంపించాలని కేంద్ర మాజీ మంత్రి, టీడీపీ కూటమి డోన్ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. శుక్రవారం డోన్ పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ ప్రతిపక్షనేతగా వైఎస్ జగన్ గత ఎన్నికల ముందు ఉమ్మడి కర్నూలు జిల్లాలో పాదయాత్ర చేసి 22 హామీలు ఇచ్చారని, వాటిలో ఏ ఒక్కటీ నెరవేర్చలేదని మండిపడ్డారు. రాష్ట్రంలోనే డోన్ నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని మాట ఇచ్చి మోసం చేయడం వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. నాపరాయి పరిశ్రమలకు ఒక యూనిట్ విద్యుత్‌ను రూ.3.70 పైసలకే ఇస్తానని హామీ ఇచ్చి నియోజకవర్గ ప్రజలను మోసం చేశారని ధ్వజమెత్తారు. టీడీపీ హయాంలో హంద్రీ నీవా ద్వారా చెరువులకు నీళ్లు నింపి ప్రజలకు తాగు, వ్యవసాయ సాగునీరు అందించేందుకు రూ.230 కోట్లు నిధులు మంజూరు చేస్తే ఆ పనులను వైసీపీ ప్రభుత్వం పూర్తి చేయలేదన్నారు. అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబుపై ఒత్తిడి తెచ్చి ఆర్డీఎస్ కుడి కాలువ, ఎల్లెల్సీ కాలువకు కర్ణాటక భూభాగంలో పైపులైన్ నిర్మాణం, వేదవతి ఎత్తిపోతల పథకం, గుండ్రేవుల జలాశయ నిర్మాణ పనులకు జీవోలు జారీ చేయిస్తే.. వాటిని రద్దు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. డోన్ నియోజకవర్గంలో అటవీశాఖ చెందిన భూములను గనుల తవ్వకానికి కార్మికులకు లీజుకు ఇస్తానని హామీ ఇచ్చి మాట తప్పారని ఎద్దేవా చేశారు. టమోటా ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేస్తామని చెప్పి దాని ఊసే లేకుండా పోయిందని ధ్వజమెత్తారు. ఉమ్మడి కర్నూలు జిల్లాకు సీఎం జగన్ ఏ మొఖం పెట్టుకొని వచ్చారని, ఓట్లు అడిగే హక్కు ఆయనకు లేదని అన్నారు.

వచ్చే ఖరీఫ్‌లో అధిక దిగుబడినిచ్చే వేరుశనగ విత్తనాలు

కర్నూలు(అగ్రికల్చర్), మార్చి 29: వచ్చే ఖరీఫ్‌లో సాగు చేయడానికి అధిక దిగుబడి ఇచ్చే కొత్త రకం వేరుశగన విత్తనాలు రైతులకు పంపిణీ చేయడానికి సిద్ధమవుతున్నట్లు జేడీ వరలక్ష్మి శుక్రవారం తెలిపారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో వేరుశనగ పంట సాగుపై గతంలో రైతులు ఎక్కువగా దృష్టి పెట్టారు. అయితే.. వర్షాభావం, తెగుళ్ల కారణంగా దిగుబడి పూర్తిగా తగ్గిపోయి పెట్టుబడి ఖర్చులు పెరిగిపోవడంతో ఈ పంట సాగు వల్ల రైతులు నష్టాలపాలయ్యారు. దీంతో గత ఐదేళ్లగా వేరుశనగ పంట సాగును రైతులు పెద్ద ఎత్తున తగ్గించారు. ప్రత్యామ్నాయంగా పత్తి సాగు వైపు ఆసక్తి పెంచుకున్నారు. దీంతో వంట నూనెల ధరలు పెరిగిపోయాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నూనెగింజల దిగుబడిని పెంచేందుకు ఇటీవల శాస్త్రవేత్తలతో పరిశోధనలు చేపట్టి మేలురకం వేరుశనగ విత్తనాల ఉత్పత్తికి శ్రీకారం చుట్టాయి. గత దశాబ్ద కాలంగా కర్నూలు, నంద్యాల జిల్లాల్లో కే-6 రకం వేరుశగన సాగు చేసేవారు. అదే విధంగా కదిరి, లేపాక్షి తదితర విత్తనాలను వాడేవారు. వచ్చే ఖరీఫ్ నుంచి వేరుశనగలో ఎక్కువ దిగుబడి ఇచ్చే కొత్తరకాలైన టీసీజీఎస్-1694 రకం విత్తనాలను సబ్సిడీపై పంపిణీ చేయడానికి వ్యవసాయ శాఖ అధికారులు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే కర్నూలు జిల్లాకు ఈ రకం విత్తనాలు 1200 క్వింటాళ్లను సిద్ధంగా ఉంచినట్లు వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి తెలిపారు. వేరుశనగలోనే కే. లేపాక్షి రకాన్ని అందుబాటులోకి తేవడానికి చర్యలు చేపట్టినట్లు జేడీ తెలిపారు. పప్పుశనగలో జే-సి-11కి ప్రత్యామ్నాయంగా ఎన్‌బీఈజీ-49, అదే విధంగా ఎన్‌బీఈఈ-49 రకాలను కంది పంట సాగులో ఎల్‌ఆర్‌జీ-41కి ప్రత్యామ్నాయంగా పీఆర్‌ఈ-176, పీఆర్‌జీ-158, ఎల్‌ఆర్‌జీ-52, ఐసీపీహెచ్-2740 వంటి రకాలను అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు. ఈ రకం విత్తనాలు బెట్టను తట్టుకుంటాయని, తెగుళ్ల పెద్దగా ఆశించవని, దీనివల్ల ఖర్చులు తగ్గి, దిగుబడి పెరుగుతుందని జేడీ వరలక్ష్మి తెలిపారు.

వీడిన ఉత్కంఠ

ఆలూరు అభ్యర్థిగా వీరభద్ర గౌడ్



కర్నూలు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి)/ఆలూరు: ఆలూరు టీడీపీ అభ్యర్థి ఎంపికలో నెలకొన్న ఉత్కంఠతకు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు తెరదించారు. శుక్రవారం విడుదల చేసిన నాలుగో జాబితాలో బీ.వీరభద్రగౌడు పేరును ప్రకటించారు. ఆయన ఎంపిక పట్ల ఆయన వర్గీయులు బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఆలూరు టీడీపీ టికెట్ కోసం ప్రస్తుత ఇన్‌చార్జి కోట్ల సుజాతమ్మ, టీడీపీ మాజీ ఇన్‌చార్జిలు వైకుంఠం మల్లికార్జున, వైకుంఠం ప్రసాద్ సతీమణి పారిశ్రామికవేత్త వైకుంఠం జ్యోతితోపాటు వీరభద్రగౌడు చివరి వరకు ప్రయత్నించారు. జిల్లాలో చోటు చేసుకున్న రాజకీయ సామాజిక సమీకరణల దృష్ట్యా డోన్ టీడీపీ అభ్యర్థిగా మాజీ కేంద్ర మంత్రి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డిని ఎంపిక చేయడంతో తప్పని రాజకీయ పరిస్థితుల వల్ల సుజాతమ్మ టికెట్ వదులుకోవల్సి వచ్చింది. అదే క్రమంలో ఇటీవల పార్టీలో చేరిన మాజీ మంత్రి గుమ్మనూరు జయరాం కూడా ఆలూరు టికెట్ ఆశించారు. ఈ పరిస్థితుల్లో నియోజకవర్గంలో సామాజికవర్గాలను పరిశీలించి రాష్ట్రంలో వీరశైవలింగాయత్‌కు కూడా అవకాశం ఇవ్వాలనే పార్టీ నిర్ణయం మేరకు వీరభద్రగౌడుకు టికెట్ దక్కింది. 2014లో ఆలూరు నుంచి పోటీ చేసిన వీరభద్రగౌడు అత్యల్పంగా 1850 ఓట్ల తేడాతో ఓటమి చెందారు. 2019లో టీడీపీలో చేరిన కోట్ల సుజాతమ్మకు అవకాశం ఇవ్వడంతో వీరభద్రగౌడుకు టికెట్ చేజారింది. ఈ సారి మూడు దఫాలుగా టీడీపీ అభ్యర్థులను ప్రకటించినా ఆలూరు అభ్యర్థిని ప్రకటించకపోవడంతో ఉత్కంఠత నెలకొంది. పొత్తులో భాగంగా ఆదోని బీజేపికి కేటాయించడం, అక్కడ వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన డా.పీవీ పార్థసారధికి టికెట్ ఇవ్వడంతో కమ్మ సామాజికవర్గానికి చెందిన వైకుంఠం కుటుంబంలో ఒకరికి అవకాశం ఇవ్వవచ్చని రాజకీయ విశ్లేషకులు భావించారు. అయితే.. సామాజిక సమీకరణల దృష్ట్యా టీడీపీ అధినేత చంద్రబాబు వీరభద్రగౌడు వైపే మొగ్గు చూపారు. తనపై నమ్మకంతో చంద్రబాబు మరోసారి అవకాశం ఇచ్చారని, నియోజకవర్గంలో కోట్ల, వైకుంఠం, గుమ్మనూరు వర్గాలను కలుపుకుని సమన్వయంతో ముందుకు సాగుతానని వీరభద్రగౌడు తెలిపారు.

ఆలూరు టీడీపీ అభ్యర్థి వీరభద్ర గౌడ్ బయోడేటా

నియోజకవర్గం	: ఆలూరు
పేరు	: బీ వీరభద్ర గౌడ్
వయస్సు	: 56 సంవత్సరాలు
తండ్రి పేరు	: బీ ముద్దు బసవన్నగౌడ్
తల్లి పేరు	: బీ సావిత్రమ్మ
స్వగ్రామం	: బీజీహళ్లి గ్రామం హోళగుంద మండలం ఆలూరు
విద్యార్హత,	: బీకాం (ఎల్ఎల్‌బీ)
వృత్తి	: పారిశ్రామికవేత్త
భార్య	: బీ పరిమళ
పిల్లలు	: ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు 1. డా. బీ ఆశాగౌడ్ 2. డా. బీ ఐశ్వర్య గౌడ్ 3. బీ గిరిమల్లేష్ గౌడ్

రాజకీయ ప్రస్థానం: వీరభద్ర గౌడ్ తండ్రి ముద్దు బసన్నగౌడ్ తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీలో కొనసాగుతూ శ్రీశైలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యుడిగా, దేవరగట్టు మాల మల్లేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా పని చేశారు. ఆయన వారసత్వాన్ని అందుకున్న ఈయన రాజకీయాల్లోకి వచ్చారు. 2014లో ఆలూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి 1836 ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. అనంతరం ఆలూరు టీడీపీ ఇన్‌చార్జిగా 2014 నుంచి 2019 వరకు కొనసాగారు.

మంత్రాలయంలో ఏపీ హైకోర్టు జడ్జి

మంత్రాలయం, మార్చి 29: రాఘవేంద్ర స్వామి దర్శనార్థం ఏపీ హైకోర్టు జడ్జి జస్టిస్ ఏవీ రవీంద్రబాబు శుక్రవారం రాత్రి మంత్రాలయం వచ్చారు. ఈయనకు పద్మనాభ తీర్థ ఏసీ గెస్ట్‌హౌస్ వద్ద ఎమ్మిగనూరు న్యాయాధికారి గురు అరవిందు, మఠం మేనేజర్లు ఎస్ కే శ్రీనివాసరావు, వెంటేష్ జోషి, శ్రీపతి ఆచార్, ఐపీ నరసింహామూర్తి ఘనంగా స్వాగతం పలికారు. శుక్రవారం మంత్రాలయం లోనే బస చేసి శనివారం గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనంకు విశేష పూజలు చేయనున్నారు.

కుక్కల దాడిలో 15 గొర్రె పిల్లల మృతి

చాగలమర్రి, మార్చి 29: మండలంలోని గొడిగనూరు గ్రామంలో కుక్కల దాడిలో 15 గొర్రె పిల్లలు శుక్రవారం మృతి చెందాయి. గ్రామానికి చెందిన పి.వీరభద్రుడు పెంచుకుంటున్న 15 గొర్రె పిల్లలు కుక్కల దాడికి మృతి చెందాయని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. కల్లం దొడ్డిలో పెంచుకుంటున్న గొర్రె పిల్లలు కుక్కల దాడిలో మృతి చెందాయని, రూ.60 వేలు నష్టం వాటిల్లిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. తనను ఆదుకోవాలని కోరారు.

హంస వాహనంపై రంగనాథ స్వామి



హంస వాహనంపై ఊరేగుతున్న రంగనాథ స్వామి

మద్దికెర, మార్చి 29: మండలంలోని పెరవలి గ్రామంలో ఎంతో ప్రసిద్ధి చెందిన రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రంగనాథుడు హంసవాహనంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. శుక్రవారం ఉదయం మూలవిరాట్ రంగనాథస్వామికి ఆలయ ప్రధాన అర్చకులు రంగస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులైన శ్రీదేవి, భూదేవి రంగనాథులను సిలారమ్మ కోటలోని బావి వద్ద ఉత్సవమూర్తులకు అభిషేకాలు పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను ముస్తాబు చేశారు. సాయంత్రం ఉత్సవమూర్తులైె శ్రీదేవి భూదేవి సమేత రంగనాథ స్వామి ఉత్సవమూర్తులను పల్లకిలో అధిష్టించి ఊరేగింపు చేశారు. కార్యక్రమంలో మాజీ సింగిల్ విండో అధ్యక్షులు దస్తగిరి గౌడు, సుబ్బలక్ష్మమ్మ దంపతులతో పాటు వారి కుమారులు ప్రశాంత్‌గౌడు, రమాకాంత్‌గౌడుతోపాటు దేవాలయ చైర్మన్ ఈడిగ దస్తగిరిగౌడు, ఈవో చంద్రశేఖర్ రెడ్డి ఉన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

మద్దికెర, మార్చి 29: మద్దికెరకు చెందిన రైతులు హనుమంతు, శీనప్పలను ప్రభుత్వం ఆదుకోవాలని మండల సీపీఐ కార్యదర్శి నాగరాజు, మండల వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు కోదండరాముడు కోరారు. శుక్రవారం మద్దికెర గ్రామంలో గ్రామానికి చెందిన రైతులు హనుమంతు, శీనప్పలకు చెందిన 30 ట్రాక్టర్ల పశుగ్రాసం మంటలకు కాలిపోయిన విషయం తెలిసిందే. వారు మాట్లాడుతూ ప్రభుత్వం రైతులను ఆదుకోవడంలో విఫలమైందన్నారు. 30 ట్రాక్టర్ల పశుగ్రాసం కాలిపోయి రూ.10 లక్షల నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం వారికి ఉచితంగా పశుగ్రాసాన్ని అందజేయాలని కోరారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

హొళగుంద, మార్చి 29 : మండల పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలను ఆలూరు నియోజకవర్గం (ఆర్‌వో) రిటర్నింగ్ ఆఫీసర్ రామునాయక్, తహసీల్దార్ ఎస్ ప్రసాద్ రాజు శుక్రవారం పరిశీలించారు. ఆయన జడ్పీ ఉన్నత పాఠశాలలోని పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్ఐ దినోజ్ కుమార్, వీఆర్వో నాగరాజ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ కూటమి అభ్యర్థికే మాదిగల మద్దతు



మాట్లాడుతున్న బండారి గిడ్డయ్య

ఆదోని (అగ్రికల్చర్), మార్చి 29 : తెదేపా-బీజేపీ-జనసేన కూటమి అభ్యర్థికే మాదిగల మద్దతు ఉంటుందని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు బండారి గిడ్డయ్య అన్నారు. ఆదివారం ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ బీజేపీ, టీడీపీ, జనసేన కూటమికి మద్దతు తెలిపారన్నారు. మాదిగల ప్రయోజనాల కోసమే మందా కృష్ణ కూటమికి మద్దతు ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాలన్న, వీరేష్, మణికంఠ, మదిరె తిమ్మప్ప, దత్తు పాల్గొన్నారు.

పాలాక్షిరెడ్డి మృతి పార్టీకి తీరనిలోటు



పాలాక్షిరెడ్డి మృతదేహానికి నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి

ఎమ్మిగనూరు రూరల్, మార్చి 29: టీడీపీ నాయకుడు పాలాక్షిరెడ్డి మృతి పార్టీకి తీరనిలోటు అని మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. మండల పరిధిలోని టీఎస్ కూలూరు గ్రామానికి చెందని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పాలాక్షిరెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న బీవీ జయనాగేశ్వరరెడ్డి టీఎస్ కూలూరు గ్రామానికి చేరుకొని పాలాక్షిరెడ్డి మృతదేహానికి నివాళి అర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

బుక్ కీపర్ల సస్పెన్షన్

వెల్దుర్తి, మార్చి, 29: మండలంలో కొసనపల్లె, చెరుకులపాడు గ్రామాలలో బుక్‌కీపర్లుగా విధులు నిర్వహిస్తున్న సుధాకర్, చిన్నరంగడులు కోడ్ ఉల్లంఘనలకు పాల్పడుతూ వైసీపీ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ఎన్నికల కోడ్ వచ్చినా వీరు వైసీపీ కార్యక్రమాల్లో పాల్గొనడంతో పాటు పొదుపు గ్రూప్ సభ్యులను భయపెడుతున్నారని చెరుకులపాడు వాసులు గురువారం తహసీల్దార్ అనంత ఆచారికి వినతి పత్రం అందజేశారు. వీరిద్దరిపైన ఎన్నికల అధికారులు విచారణచేయగా కోడ్ ఉల్లంఘనలకు పాల్పడినట్లు విచారణలో తేలడంతో విధుల నుండి తొలగిస్తూ డీఆర్‌డీఏ-వైకేపీ పీడీ సలీమ్‌బాషా శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు.

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి

పత్తికొండ టౌన్, మార్చి 29: వివిధ కేసుల్లో ఉన్న ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని పత్తికొండ సబ్‌జైలు సూపరింటెండెంట్ చంద్రమోహన్ సూచించారు. శుక్రవారం స్థానిక సబ్ జైలులో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోషల్ ఇన్ క్యూబేషన్ సెంటర్‌ను సబ్ జైలు సూపరింటెండెంట్ ప్రారంభించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రంగస్వామి, సామాజిక సేవకులు వెంకటేశ్వర్లు, రాజు పాల్గొన్నారు.

నిబంధనల ఉల్లంఘన

పత్తికొండ, మార్చి 29: ఎమ్మిగనూరు జరుగుతున్న ముఖ్యమంత్రి సిద్ధం సభకు పత్తికొండ మండలం పందికోన నుంచి వైసీపీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం ఉదయం బయలుదేరి వెళ్లారు. స్థానిక ఎమ్మెల్యే శ్రీదేవి వీరిని సాగనంపారు. ఈ బస్సు యాత్రకు గ్రామానికి చెందిన నాయకులు, కార్యకర్తలతో పాటు వలంటీర్లు ఎర్రమల శివ, బుల్లేని పాండులు బయలుదేరి వెళ్లారు. వలంటీర్లపై చర్యలు తీసుకోవాలని స్థానిక టీడీపీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

కోసిగి: మండలంలోని కోల్‌మాన్‌పేట గ్రామానికి చెందిన వలంటీర్లు రాజు, హనుమంతు గ్రామంలోని వైసీపీ నాయకులతో కలిసి బస్సులో సిద్ధం సభకు తరలివెళ్లారు. అలాగే చిన్నభూంపల్లి గ్రామానికి చెందిన వాలంటీర్ శ్రీకాంత్, అలాగే కోసిగికి చెందిన వలంటీర్ అంజి, మోనేషాచారిలు వైసీపీ శ్రేణులతో కలిసి బస్సులో సిద్ధం సభకు వెళ్లారు. వీరితో పాటు కోసిగిలోని ప్రభుత్వ మద్యం దుకాణంలో పని చేస్తున్న సూపర్‌వైజర్, వెలుగు కార్యాలయంలో పని చేస్తున్న సెర్ప్ వీబీకేలు వైసీపీ సిద్ధం సభకు ఆ పార్టీ నాయకులతో కలిసి వెళ్లారు. నిబంధనలు ఉల్లంఘించిన వీరిపై చర్యలు తీసుకోవాలని ప్రతిపక్ష పార్టీలు ఎన్నికల కమిషన్‌ను కోరారు.

ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం



ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి



పత్తికొండ టీడీపీ కార్యాలయంలో టీడీపీ ఆవిర్భావ వేడుకల్లో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు



తుగ్గలిలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న తుగ్గలి నాగేంద్ర



దేవనకొండలో కేక్ కట్ చేస్తున్న నాయకులు



ఆదోనిలో మాట్లాడుతున్న గుడిసె కిష్టమ్మ



ఆలూరులో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న టీడీపీ నాయకులు

ఆదోని, మార్చి 29 : తెలుగుదేశం పార్టీ 42వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా టీడీపీ మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు, టీడీపీ నేతలు, అభిమానులతో కలసి వేడుకలు నిర్వహించారు. శుక్రవారం మీనాక్షి నాయుడు స్వగృహంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం టీడీపీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మీనాక్షినాయుడు మాట్లాడుతూ తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు స్వర్గీయ ఎన్టీఆర్ టీడీపీని స్థాపించారన్నారు. తెలుగుజాతి కీర్తిని ఎన్టీఆర్ ప్రపంచానికి చాటి చెప్పారని కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు, మారుతీరావు, రామస్వామి, అఫ్సర్ బాష, శ్రీనివాసాచారి, భూపాల్ చౌదరి, షాధికా బేగం, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ చౌదరి పాల్గొన్నారు.

● టీడీపీ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా మాజీ ఫుడ్ కమిషన్ సభ్యురాలు గుడిసె కృష్ణమ్మ స్వగృహంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి, టీడీపీ జెండాను ఆవిష్కరించి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుడిసె శ్రీరాములు, మురళి, బాబురావు, నాగేంద్ర, రవి, శ్రీనివాస్, నరసప్ప, తిమ్మారెడ్డి, పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు: తెలుగుదేశం పార్టీ 42వ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక పార్టీ కార్యాలయం దగ్గర టీడీపీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్, బీవీ మోహన్‌రెడ్డిల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం బీవీ జయనాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని కాపాడిన వ్యక్తి ఎన్టీఆర్ అన్నారు. తెలుగు ప్రజల అభ్యున్నతికి పాటుపడిన మహోన్నత వ్యక్తి స్వర్గీయ ఎన్టీఆర్ అని కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మంత్రాలయం: మంత్రాలయంలో టీడీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో జెండాను ఎగురవేశారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ పన్నగ వెంకటేశ్, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి దివాకర్ రెడ్డి, సుధీర్ రెడ్డి, నవీన్, పూజారి వ్యాసరాజాచార్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు అమర్నాథ్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి, విజయరామిరెడ్డి, రాజు, ఎంపీటీసీ మేకల వెంకటేశ్, నాగరాజు, ఎల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తుగ్గలి: టీడీపీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి, ఎన్టీఆర్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరం కృషి చేద్దామని శాలివాహన కార్పొరేషన్ మాజీ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర అన్నారు. శుక్రవారం టీడీపీ 42వ ఆవిర్భావం దినోత్సవం తుగ్గలి, జొన్నగిరి, శభాష్‌పురం, రాంపల్లి, ముక్కెళ్ల, రాతన తదితర గ్రామాల్లో ఆయా గ్రామాల పార్టీ నాయకులు, మండల నాయకులు, కార్యకర్తలు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తిరుపాల్‌నాయుడు, బాలన్న, శివరాముడు చౌదరి, లక్ష్మణస్వామి, రవి యాదవ్, గిరిగిట్ల మల్లి, రాంపురం మల్లయ్య ఆదినారాయణ, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

దేవనకొండ: మండలంలో టీడీపీ 42వ ఆవిర్భావ దినోత్సవాన్ని టీడీపీ కార్యాలయంలో ఘనంగా వేడుకలు జరుపుకున్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ విజయభాస్కర్‌గౌడ్, బడిగింజల రంగన్న ,వీరేష్ ,మలకన్నమల్లయ్యడీల్లర్ బండ్లయ్య, ఉచ్చీరప్ప,మస్తాన్,నాగరాజుగౌడ్, రాజశేఖర్ గౌడ్, పెద్దయ్య, వడ్డె గోవిందు, తదితరులు పాల్గొన్నారు.

హొళగుంద : మండలంలో టీడీపీ ఆర్భావించి వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ తిప్పయ్య, చిన్నహ్యాట శేషగిరి, హెబ్బటం విష్ణువర్ధన్ రెడ్డి, మైనార్టీ నాయకుడు ఎండీ ఆదాం, తుంబళం గాదిలింగ, కురువ మల్లికార్జున, మంగయ్య, వీరేంద్ర, బుడగజంగాల లక్ష్మన్న, ఐటీడీపీ మల్లికార్జున, పింజారి పీరా పాల్గొన్నారు.

ఆలూరు: టీడీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శుక్రవారం ఆలూరు పట్టణంలో ఘనంగా నిర్వహించారు. నందమూరి తారక రామారావు చిత్రపటానికి పూలమాల వేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ముద్దరంగ, గూళ్యం రామాంజినేయులు, విష్ణు, ఉలిగప్ప పాల్గొన్నారు.

గోనెగండ్ల: మండలంలో టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో జిల్లా టీడీపీ కార్యదర్శి ప్రభాకర్‌నాయుడు, జిల్లా టీడీపీ సాంస్కృతిక విభాగం ప్రధాన కార్యదర్శి కౌలుట్లయ్యానాయుడు, నాయకులు పాల్గొన్నారు.

క్రిష్ణగిరి: తెలుగుదేశం పార్టీ 42వ ఆవిర్భావ దినోత్సవాన్ని నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు.శుక్రవారం కంబాలపాడు గ్రామంలో జరిగిన ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమంలో పత్తికొండ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కేఈ శ్యాంబాబు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళర్పించారు. కార్యక్రమంలో నాయకులు మర్రి శ్రీరాములు,గురుస్వామి,ప్రసాద్, మహమ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పరి: మండల కేంద్రంలో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు కార్యక్రమంలో మాజీ మండల కన్వీనర్ ఎస్ తిమ్మన్న, ఆస్పరి మాజీ సర్పంచ్ రామలింగప్ప యాదవ్, మాజీ మార్కెట్ డైరెక్టర్లు కే గోవిందప్ప, కే సంజన్న, చిరుమాను దొడ్డి మాజీ సర్పంచ్ సోమలింగప్ప యాదవ్, తెలుగు యువత మండల అధ్యక్షులు రాఘవేంద్ర యాదవ్, ఆస్పరి వార్డ్ మెంబర్లు పాల్గొన్నారు

వీరభద్ర గౌడ్‌కు ఘన స్వాగతం



హొళగుంద బస్టాండ్‌లో బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకుంటున్న టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు

ఆలూరు, మార్చి 29 : ఆలూరు టీడీపీ అభ్యర్థిగా వీరభద్రగౌడ్‌ను టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ప్రకటించడంతో శుక్రవారం రాత్రి ఆలూరులో ఆయనకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. డా బీఆర్ అంబేడ్కర్, మహర్షి వాల్మీకి విగ్రహాలకు ఆయన పూలమాలలు వేశారు. టీడీపీ నాయకులంతా సమష్టిగా కష్టపడి ఈసారి ఆలూరులో టీడీపీ జెండా ఎగరవేద్దామని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బాణసంచా కల్చి సంబరాలు జరుపుకున్నారు.

హొళగుంద: ఆలూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా మాజీ టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్‌ను అధిష్టానం శుక్రవారం ఖరారు చేయడంతో తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు స్థానిక బస్టాండ్, వాల్మీకి సర్కిల్‌లో బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. అనంతరం వాల్మీకి విగ్రహానికి పూలమాల వేశారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆదోని టౌన్: ఆదోని డివిజన్‌లోని ఆలూరు నియోజకవర్గానికి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా వీరశైవ సామాజిక వర్గానికి చెందిన వీరభద్రగౌడ్‌ను ఎంపిక చేయడం పట్ల ఏపీ వీరశైవ సంఘం రాష్ట్ర కో-ఆర్డినేటర్ శివరాజు, కన్నె జగదీష్, ఎండీ భద్రీనాథ్ స్వామి తమ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం వీరు మాట్లాడుతూ, రాజకీయంగా పూర్తిగా వెనుకబడిన వీరశైవలను గుర్తించి ఎన్నికలలో పోటీ చేయడానికి అవకాశం కల్పించినందుకు టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు, రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెంనాయుడులకు ధన్యవాదాలు తెలిపారు. విజయకుమార్ మహర్షి, జేపీ మల్లికార్జున పాల్గొన్నారు

చిప్పగిరి: ఆలూరు, గుంతకల్లు టీడీపీ అభ్యర్థుల పేర్లు ఖరారు కావడంతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు చిప్పగిరిలో శుక్రవారం రాత్రి సంబరాలు జరుపుకున్నారు. గుంతకల్ టీడీపీ అభ్యర్థిగా గుమ్మనూరు జయరాంకు, ఆలూరు వీరభద్రగౌడ్‌కు ఖరారు కావడంతో ఆ పార్టీ నాయకులు బంగారు సతీష్, బాలక్రిష్ణ, చిప్పగిరి బోగేష్, జనార్దన్ గౌడ్ పెద్ద ఎత్తున బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. చిప్పగిరికి చెందిన బంగారు సతీష్ సత్తార్ స్వామి, భంభం స్వామి దర్గాలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భోగేశ్వరస్వామి దేవాలయం వద్ద 101 టెంకాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నారు. జయరాంకు గుంతకల్లు టికెట్ రావడం సంతోషంగా ఉందన్నారు.

ఆస్పరి: టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు ఆలూరు టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థిగా వీరభద్రగౌడ్‌కు ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించడంతో శుక్రవారం సంబరాలు జరుపుకున్నారు. ఆస్పరి మండల టీడీపీ నాయకులు, వీరభద్రగౌడ్ అభిమానులు, కార్యకర్తలు అంబెద్కర్ సర్కిల్లో, మరియు బస్టాండ్ ఆవరణంలో బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ ఆస్పరి మండల యువనాయకులు సతీష్ కుమార్, టీడీపీ సీనియర్ నాయకులు సర్పంచ్ ఆంజనేయులు, నాయకులు వలిసాహెబ్, బాలు, క్రిష్ణ, మహేష్, పూజారి మహేష్, ఫోటో వీరేష్, భాస్కర్ రవి, మారేష్, షారుఖ్, లోకేష్ పాల్గొన్నారు.

దౌర్జన్య పాలనకు చరమగీతం పాడుతాం



ఉమ్మడి అభ్యర్థి డా. పార్థసారథికి స్వాగతం పలుకుతున్న బీజేపీ నాయకులు

ఆదోని టౌన్, మార్చి 29 : ఆదోని నియోజవర్గంలో జరుగుతున్న దౌర్జన్యాలు, కబ్జాలు, దుర్మార్గాలతో ప్రజలు విసిగిపోయారని, ఇకపై కొనసాగనివ్వమని ఆదోని అసెంబ్లీ కూటమి ఉమ్మడి అభ్యర్థి డా. పార్థసారథి వైసీపీ నాయకులకు హెచ్చరించారు. శుక్రవారం రాత్రి ఆదోని పట్టణానికి చేరుకున్న ఆయనను బీజేపీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ, అసెంబ్లీ కన్వీనర్ శ్రీరాములు, కో-కన్వీనర్ నాగరాజ్ గౌడ్, బైపాస్ రోడ్డు వద్ద ఘనంగా స్వాగతం పలికారు. శ్రీనివాస సర్కిల్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి, పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం విలేఖరులతో మాట్లాడుతూ స్థానిక ప్రజలకు సేవ చేసే అవకాశం కోసం ఎన్నికల బరిలో తాడోపేడో తేల్చుకోవడం కోసమే ఆదోనికి వచ్చానని అన్నారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు సాయికుమార్, దేవేంద్ర, విజయ్‌కృష్ణ పాల్గొన్నారు.

వచ్చేది టీడీపీ ప్రభుత్వమే: మీనాక్షినాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు

ఆదోని, మార్చి 29 : వైసీపీ ప్రభుత్వానికి కౌంట్‌డౌన్ ప్రారంభమైందని, రాష్ట్రంలో ఆబోయేది టీడీపీ ప్రభుత్వమేనని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొంకా మీనాక్షినాయుడు జోస్యం చెప్పారు. శుక్రవారం మీనాక్షినాయుడు స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తనకు టికెట్ దక్కలేదని బాధ ఏమాత్రం లేదని, కూటమి అభ్యర్థి గెలుపుకు శాయశక్తులా కృషి చేసి జెండా ఎగురవేస్తామన్నారు. బీజేపీ అభ్యర్థి డా. పార్థసారథి గెలుపు కొరకు కలిసికట్టుగా కృషి చేద్దామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఉమాపతి నాయుడు, మారుతీరావు, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ చౌదరి, అఫ్సర్ బాషా, అల్తాఫ్ శివప్ప, రామస్వామి, మాధవ, మదిరె వీరేష్, షాదికా బేగం పాల్గొన్నారు.

టీడీపీతోనే అభివృద్ధి

మంత్రాలయం టీడీపీ అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి



మాట్లాడుతున్న రాఘవేంద్రరెడ్డి

కౌతాళం, మార్చి 29: టీడీపీతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఉమ్మడి పార్టీ మంత్రాలయం నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి మాధవరం రాఘవేంద్ర రెడ్డి అన్నారు. కౌతాళంలో శుక్రవారం మండల నాయకుల ఆత్మీయ సమ్మేళ సమావేశాన్ని మండల అధ్యక్షుడు ఉలిగయ్య అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంతకు ముందు గ్రామంలోని శ్రీకృష్ణావధూత ఆశ్రమం నుంచి కోసిగి, పెద్దకడబూరు, కౌతాళం మండలాల నాయకులు, కార్యకర్తలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్, కనకదాసు విగ్రహనికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అక్కడ నుంచి నూతనంగా నిర్మించిన తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన మండల ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం రాఘవేంద్ర రెడ్డి మాట్లాడుతూ 46 రోజులు కార్యకర్తలు సైనికులుగా నిరంతరం కష్టపడుతూ బాబు ష్యూరిటీలోని సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకుపోవాలన్నారు. కార్యక్రమంలో కోసిగి, పెద్దకడబూరు, కౌతాళం మండలాల మండల కన్వీనర్లు జ్ఞానేష్, బసలదొడ్డి ఈరన్న, ఉలిగయ్య, రాష్ట్ర రైతు సంఘం అధికార ప్రతినిధి రమాకాంత్ రెడ్డి, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేష్ నాయుడు, వల్లెపాడు రామిరెడ్డి పాల్గొన్నారు.

తుగ్గలి ఎంపీపీ ఆదెమ్మ రాజీనామా

కర్నూలు(న్యూసిటీ), మార్చి 29: తుగ్గలి ఎంపీపీ ఆదెమ్మ అనారోగ్య కారణాల వల్ల తన పదవికి రాజీనామా చేస్తూ జడ్పీ సీఈవో నాసరరెడ్డికి శుక్రవారం తన రాజీనామా లేఖను అందజేశారు. ఈ మేరకు జడ్పీ సీఈవో ఆమె రాజీనామా పత్రాన్ని ఆమోదించారు. ఖాళీ ఏర్పడిన ఈ ఎంపీపీ పదవికి తాత్కాలికంగా భర్తీ చేసేందుకు ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎంపీపీ ఉపాధ్యక్షులుగా ఉన్న ఇద్దరిలో ఒకరిని ఎంపీపీగా తాత్కాలిక ప్రాతిపదికన నియమించేందుకు ఎన్నికల సంఘానికి, జిల్లా కలెక్టర్‌కు నివేదికను పంపించామని జడ్పీ సీఈవోకి పేర్కొన్నారు.

చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం ఖాయం

● టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పాలకుర్తి తిక్కారెడ్డి



మాట్లాడుతున్న తిక్కారెడ్డి

మంత్రాలయం, మార్చి 29: వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అఖండ విజయం సాధించి ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు కావడం ఖాయమని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పాలకుర్తి తిక్కారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో కోసిగి పట్టణ నాయకులు, కార్యకర్తలతో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి దివాకర్ రెడ్డి, పన్నగ వెంకటేశ్ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. తిక్కారెడ్డి మాట్లాడుతూ జగన్ చెప్పే మాయమాటలు నమ్మి ఒక్క చాన్స్ అంటూ అధికారం ఇస్తే రాష్ట్రాన్ని దివాలా తీయించారని ఆరోపించారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలంటే చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. సమావేశంలో భరద్వాజ్ శెట్టి, వక్రాణి వెంకటేశ్వర్లు, నాడిగేని అయ్యన్న, రంగన్న, అమర్నాథ్ రెడ్డి, విజయరామిరెడ్డి, వీరారెడ్డి, పంపాపతి, ఉమర్‌సాబ్, ఖలందర్, వడ్డే రామయ్య, నర్సారెడ్డి, కప్పయ్య, నర్సన్న, మహదేవ పాల్గొన్నారు.

టీడీపీతోనే రాష్ట్ర భవిష్యత్తు

మద్దికెర, మార్చి 29: రాష్ట్ర భవిష్యత్తు తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని శాలివాహన కార్పొరేషన్ మాజీ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర, మాజీ జడ్పీటీసీ సభ్యులు పురుషోత్తం చౌదరి, జిల్లా టీడీపీ కార్యదర్శి గూడూరు ధనుంజయుడు అన్నారు. శుక్రవారం మద్దికెర గ్రామంలో వారు మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తుంటే.. సీఎం జగన్ రెడ్డి రాష్ట్రాన్ని అధోగతి పాల్జేశాడన్నారు. మద్యపాన నిషేధం చేస్తామని హామీ ఇచ్చిన జగన్ రెడ్డి నాసిరకం మద్యం సరఫరా చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ధ్వజమెత్తారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీని ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. సమావేశంలో నాయకులు మెడికల్ తిమ్మప్ప, బసినేపల్లి హరినాథ్‌గౌడు, తిమ్మప్ప, శాంతిరెడ్డి, సతీష్, తదితరులు ఉన్నారు.

టీడీపీలో చేరిన గుంటుపల్లె వైసీపీ కార్యకర్తలు



టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

వెల్దుర్తి, మార్చి, 29: గుంటుపల్లె టీడీపీ గ్రామనాయకుడు ఈదుల వెంకటరాముడు ఆధ్వర్యంలో శుక్రవారం వైసీపీ కార్యకర్తలు కేఈ.శ్యాంబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. కేఈ.శ్యాంబాబు మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం అమలు చేసిన అన్నక్యాంటీన్లు, చంద్రన్న బీమా, ఆదరణ, విదేశీవిద్య, పెళ్లికానుక లాంటి 100కి పైగా సంక్షేమ పథకాలు రద్దు చేశారన్నారు. రాష్ట్ర భవిష్యత్తుకు చంద్రబాబు గ్యారెంటీ అని రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలంటే చంద్రబాబుతోనే సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు రమాకాంత్‌రెడ్డి, జయరాముడు, రామకృష్ణాచారి, రామకృష్ణ, రాముడు, సుధాకర్‌గౌడ్, రాఘవేంద్ర గౌడ్, ఉస్మాన్, బషీర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సుయతీంద్రతీర్థుల-2024 అవార్డుల ప్రదానం



శంకర్‌రావుకు అవార్డు ప్రదానం చేస్తున్న పీఠాధిపతి

మంత్రాలయం, మార్చి 29: మంత్రాలయం రాఘవేంద్రస్వామి పూర్వపు పీఠాధిపతి సుయతీంద్రతీర్థుల-2024 అవార్డులను మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ప్రదానం చేశారు. శుక్రవారం రాత్రి యజ్ఞశాలలో ప్రత్యేక వేదికపై మంత్రాలయం చెందిన శ్రీమఠం వీఐపీ భోజనశాల ఇన్‌చార్జిగా పని చేస్తున్న శంకర్‌రావుకు, రాయచూరుకు చెందిన న్యాయవాది వెంకటగిరి ఫరండే, హంపీకి చెందిన ఇంటర్నేషనల్ తబల ఆర్టిస్టు సతీష్‌కు అవార్డులను అందజేశారు. అవార్డుతో పాటు మెమెంటో, నగదు, వెండి ప్లేటు, శేషవస్త్రం, ఫలపుష్ప మంత్రాక్షితలు ఇచ్చి సత్కరించారు. కార్యక్రమంలో మఠం మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, ఐపీ నరసింహమూర్తి, ఈఈ సురేష్ కోనాపూర్, ఏఈ బద్రినాథ్, విజేంద్రాచార్, రవి కులకర్ణి, అనంతపురాణిక్, జేపీ స్వామి తదితరులు పాల్గొన్నారు.